Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU




అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 317 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 4 - 8 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు బిల్లుకు లోక్‌సభ ఆమోదం



**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. సుప్రీం కోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ప్రధాన న్యాయమూర్తితో కలిపి 34 నుంచి 38కి పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అయితే, నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండటంతో ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు ఆమోదం పొందింది. ఆర్డినెన్స్ జారీని వ్యతిరేకిస్తూ విపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కూడా మూజువాణి ఓటుతో సభ తిరస్కరించింది. సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు–2026ను సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ దాని గురించి వివరించారు. అనంతరం బిల్లుపై సభ్యులు మాట్లాడాలని సభాపతి ఓం బిర్లా కోరినప్పటికీ, విపక్షాల నినాదాలు కొనసాగడంతో బిల్లును ఓటింగ్‌కు పెట్టారు. దీంతో ఎలాంటి చర్చ లేకుండానే న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు–2026కు సభ ఆమోదం తెలిపింది. ఇటీవల జనన, మరణాల నమోదు చట్ట సవరణ బిల్లు కూడా లోక్‌సభలో చర్చ లేకుండానే ఆమోదం పొందింది. తాజా బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభను స్పీకర్ వాయిదా వేశారు.

## ఉదయనిధి సభలో 'త్రిష' నినాదాలు.. డీఎంకే కార్యకర్తల హంగామా



**ఇంటర్నెట్ డెస్క్:** కావేరి జలాల సమస్యపై డీఎంకే ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ఈ ధర్నాలో డీఎంకే నేత, ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయనిధి స్టాలిన్ ప్రసంగిస్తూ రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు ఉన్న ఏకైక టెన్షన్ అంటూ ఉదయనిధి వ్యాఖ్యలు చేస్తుండగా, సభలో కొంతమంది డీఎంకే కార్యకర్తలు ఒక్కసారిగా 'త్రిష.. త్రిష..' అంటూ నినాదాలు చేయడం ప్రారంభించారు. దీంతో సమావేశ ప్రాంగణంలో కొద్దిసేపు సందడి నెలకొంది. ఉదయనిధి ప్రసంగం కొనసాగుతుండగానే కార్యకర్తల నినాదాలు వినిపించడంతో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే.. మదురైలో ప్రముఖ నటి త్రిష రాజకీయ ప్రవేశాన్ని కోరుతూ పోస్టర్లు వెలవడం వైరల్‌గా మారింది. మదురై ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ పోస్టర్లలో త్రిష రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షిస్తూ సందేశాలు కనిపించాయి. దీంతో ఆమె పొలిటికల్ ఎంట్రీపై సోషల్ మీడియా, రాజకీయ వర్గాల్లో మరోసారి చర్చ మొదలైంది. అయితే త్రిష ఇప్పటివరకు తన రాజకీయ ప్రవేశంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

## అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌పై సానుకూల ముందడుగు



**అమరావతి, (రాజధాని వార్తలు):** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించి అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు ఐడిపీఆర్ డైరెక్టర్ విశ్వనాథన్‌ను కలిసి, సుప్రీంకోర్టు మాజీ రిజిస్ట్రార్ జనరల్ నుంచి పొందిన లీగల్ ఒపీనియన్ ను సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించిన న్యాయపరమైన, విధానపరమైన అంశాలను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, ఈ అంశాన్ని సంబంధిత అధికారుల దృష్టికి చేర్చాలని కోరారు. సొసైటీ ప్రతినిధుల వినతిపై ఐ&పీఆర్ డైరెక్టర్ విశ్వనాథన్ చాలా సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌పై ప్రభుత్వం ఇప్పటికే కొన్ని చర్యలు చేపడుతోందని, ఈ అంశంపై ప్రభుత్వం స్థాయిలో అవసరమైన ప్రక్రియ కొనసాగుతోందని ఆయన తెలిపారు. జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్ పురోగతికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశాన్ని పరిష్కరించేందుకు సానుకూలంగా స్పందించిన ఐ&పీఆర్ డైరెక్టర్ విశ్వనాథన్‌కు సొసైటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. సుప్రీం కోర్టు మాజీ రిజిస్టర్ జనరల్ ఇచ్చిన న్యాయ నివేదికను అనుసరించి తమ సొసైటీ సభ్యులకు గృహ నిర్మాణం చేసేందుకు ఎటువంటి అడ్డంకి లేదని డైరెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అర్హులైన జర్నలిస్టుల దీర్ఘకాల నిరీక్షణకు త్వరలోనే సానుకూల పరిష్కారం చూపుతాయనే ఆశాభావాన్ని వ్యక్తం అయ్యింది. ఈ కీలక సమావేశంలో అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి పాటిబండ్ల నాగ శ్రీనివాస్, విశాలాంధ్ర బ్యూరో చీఫ్ చావా రవి, సీనియర్ జర్నలిస్టులు డాక్టర్ రవి కుమార్ బొప్పన, మల్లికార్జునరావు పాల్గొని న్యాయ నిపుణుల అభిప్రాయాన్ని సమర్పించి, జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌పై ఐడపీఆర్ డైరెక్టర్‌తో చర్చించారు.

## మంత్రి సుభాష్ చొరవ.. ఆ వ్యాధితో బాధ పడుతున్న బాలుడికి శస్త్రచికిత్స




**అమరావతి, (రాజధాని వార్తలు):** అన్ని శాఖల్లో డేటా ఆధారిత పాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆర్‌టీజీ ఎస్‌లో డేటా ఆధారిత నిర్ణయాలపై సీఎం చంద్రబాబు సోమ వారం సమీక్ష సమావేశం నిర్వహించారు. Data Driven Decision Makingపై అధికారులకు సీఎం మార్గనిర్దేశం చేశారు. సీఎం సమీక్షకు ఏపీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, ఐటీ, ఆర్‌టీజీఎస్, వ్యవసాయం, మున్సిపల్, సంక్షేమ శాఖల ఉన్నతాధి కారుల హాజరయ్యారు. రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థ పనితీరుపై సమీక్షించారు.

ఆర్‌టీజీ ద్వారా పాలన మరింత సమర్థవంతంగా, సులభంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలతో డేటా వినియోగాన్ని పెంచాలని ఆదేశించారు. ఆయా శాఖల వారీగా డేటా సమన్వయంపై అధికారులతో సీఎం

## అర్హులందరికీ 'నేతన్న సేవలో..'-రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

**- ఏటా చేనేతలకు రూ.25 వేల ఆర్థిక సాయం - ఈ నెల 7 నుంచి పథకం అమలు - 5 తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులకు తుది గడువు - గడువులోగా చేనేతలు దరఖాస్తులు చేసుకోవాలి - ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా 'నేతన్న సేవలో...' అమలు చేస్తున్నాం - చేనేతల గౌరవప్రదమైన జీవనమే సీఎం చంద్రబాబు లక్ష్యం - పథకం అమలులో ఆరోపణలకు, విమర్శలకు తావివ్వొద్దు - 7న చీరాలలో జాతీయ చేనేత దినోత్సవం వేడుకలు - హాజరు కానున్న సీఎం చంద్రబాబు - చేనేత, జౌళి శాఖాధికారుల సమీక్షా సమావేశంలో మంత్రి సవిత**






**అమరావతి, (రాజధాని వార్తలు):** అర్హులైన వారందరికీ నేతన్న సేవలో పథకం వర్తింపజేస్తామని, చేనేతలకు ఆర్థిక భరోసాతో కూడిన గౌరవప్రదమైన జీవనం అందించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. నేతన్నలకు ఏటా రూ. 25 వేలను ఆర్థిక సాయం అందజేసేలా నేతన్న సేవలో పథకాన్ని రూపొందించారన్నారు. ఈ నెల ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని శ్రీకారం చుడుతున్నామని, అయిదో తేదీలోగా అర్హులైన చేనేతలు దరఖాస్తులు చేసుకోవాలని మంత్రి సవిత కోరారు. రాష్ట్ర సచివాలయంలో అన్ని జిల్లాలకు చెందిన చేనేత, జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చేనేతలకు గౌరవ ప్రదమైన జీవనం అందించడమే సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అదే సమయంలో చేనేతలకు వ్యక్తిగతంగా ఆర్థిక వృద్ధి కలిగేలా పలు సంక్షేమ పథకాలను శ్రీకారం చుట్టామన్నారు. 50 ఏళ్లు నిండిన నేతలన్నకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. ప్రతి చేనేత కుటుంబానికి లబ్ధి కలిగేలా ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మగ్గం మీద నేసే నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్ల వరకూ విద్యుత్ ను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఇవే కాకుండా త్రిఫ్ట్ ఫండ్ నిధులు, ముద్రా రుణాలను కూడా అందజేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

**హామీ ఇవ్వకున్నా 'నేతన్న సేవలో...' అమలు**

ఎన్నికల్లో హామీ ఇచ్చిన పథకాలతో పాటు హామీ ఇవ్వని పథకాలను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. చేనేతలకు ఏటా రూ. 25 వేల ఆర్థిక సాయం అందజేసేలా నేతన్న సేవలో పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుడుతున్నారు. ఈ నెల ఏడో తేదీన జాతీయ దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి చేనేతకూ ఏడాదికి రూ. 25 వేలు అందించనున్నామన్నారు. చేనేత వృత్తిదారులకు ప్రభుత్వ పరంగా అండాలనే ఉద్దేశంతో నూతన పథకానికి శ్రీకారం చుడుతున్నారన్నారు. చేనేత కుటుంబాలు గౌరవప్రదమైన జీవనం సాగించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు.

**5 వరకూ దరఖాస్తులకు గడువు**

రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతి నేతన్నకూ నేతన్న సేవలో పథకం ద్వారా ఆర్థిక సాయం అందించాలనేది సీఎం చంద్రబాబు ప్రధాన ఉద్దేశమని మంత్రి సవిత వెల్లడించారు. ఈ నెల అయిదో తేదీ సాయంత్ర అయిదు గంటల్లోకా అర్హులైన నేతన్నలు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ నెల ఏడో తేదీ నుంచి ఆర్థిక సాయం పథకాన్ని అమలు చేయనున్నామన్నారు. అన్ని జిల్లాలకు చెందిన చేనేత, జౌళి శాఖ ఏడీలు నేతన్న సేవలో పథకంపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. మీడియాలోనూ సమాచారమివ్వాలని, వీలైనంత ఎక్కువ మంది నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి నేతన్నకూ నేతన్న సేవలో పథకం లబ్ధి కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్య సాధనలో భాగంగా, విమర్శలకు, ఆరోపణలకు తావులేకుండా నేతన్న సేవలో సథకం అమలయ్యేలా అధికారులు పనిచేయాలని మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సోసిడియా మాట్లాడుతూ, ఈ నెల ఆరో తేదీ ఉదయానికి అన్ని జిల్లాల నుంచి లబ్ధిదారుల వివరాలు అందజేయాలన్నారు.

**7న చీరాలలో జాతీయ చేనేత దినోత్సవం**

ఈ నెల ఏడో తేదీన చీరాలలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఆనాటి వేడుకలకు సీఎం చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు.

అదే రోజు నేతన్న సేవలో పథకానికి ఆయన శ్రీకారం చుడతారన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ర్యాలీలు, చేనేత వస్త్రాల వినియోగంపై ప్ల కార్డులు కూడా ప్రదర్శించాలని మంత్రి సవిత స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, అన్ని జిల్లాల ఏడీలు, ఆప్కో అధికారులు పాల్గొన్నారు.

## నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తి : సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి అయ్యాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందని వ్యాఖ్యానించారు. నిమ్స్‌లో రెండున్నరేళ్లలో 1,000 రొబోటిక్ సర్జరీలు పూర్తి అయ్యాయని తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో నిమ్స్ వైద్య బృందం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారిని మంత్రి దామోదర అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటికే 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను నిమ్స్ పూర్తి చేసిందని వెల్లడించారు. దక్షిణ భారత ప్రభుత్వ రంగంలో తొలి రొబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌ను నిమ్స్ చేసిందని మంత్రి దామోదర చెప్పుకొచ్చారు. 90 శాతానికి పైగా రొబోటిక్ సర్జరీలు ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఉచితమని తెలిపారు. యూరాలజీలో 590, గ్యాస్ట్రోలో 248, ఆంకాలజీలో 162 రొబోటిక్ సర్జరీలు జరుగుతాయని వివరించారు. ఎంఎన్‌జేలోనూ విజయవంతంగా రొబోటిక్ సర్జరీలు నిర్వహిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. కొత్త టిమ్స్, గాంధీ, ఉస్మానియాలో రొబోటిక్ ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తెస్తున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

# పాటూరులో మాజీ మంత్రి ప్రసన్న ఆత్మీయ సమావేశం

**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు మండలం, పాటూరు గ్రామంలో మాజీ మంత్రి ప్రసన్నకుమార్ రెడ్డి, వైసీపీ నేతలు, ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహించడం జరిగింది, తిక్క వరపు సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహించడము జరిగింది. మాజీ మంత్రి వైసీపీ రాష్ట్ర పిఏసి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి.

సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకులు వీరి చలపతిరావు ఈ సమావేశంలో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పాటూరు గ్రామంలో చేసిన అభివృద్ధి పనులు మరియు సంక్షేమ పథకాలు గురించితెలిపారు మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి మాట్లాడుతూ 'పాటూరు' గ్రామ పంచాయతీలో అర్హులైన ప్రతి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ద్వారా 'ప్రత్యక్ష నగదు' బదిలీతో అందించిన సహాయం రూ.22కోట్ల 14లక్షలు పరోక్ష ప్రయోజనాలు కింద రూ. 10కోట్ల 55లక్షలు కులం, మతం, పార్టీలకు అతీతంగా పాటూరు గ్రామ పంచాయతీలో లబ్ధిదారులకు చేసిన సహాయం మొత్తం రూ.32కోట్ల 69లక్షలు.

**ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) పథకాలు**

జగనన్న అమ్మఒడి 473 మందికి రూ. 2,12,97,499 జగనన్న




విద్యాదీవెన 280 మందికిరూ. 84,44,621 జగనన్న వసతి దీవెన 223 మందికి రూ. 36,56,749 వైఎస్సార్ రైతు భరోసా 442 మందికిరూ. 2,11,47,750 వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాలు 106 మందికి రూ. 3,02,449 రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ 3 మందికి రూ. 18,934 వైఎస్సార్పెన్షన్కానుక 860 మందికి 8,13,87,500 వైఎస్సార్ చేయూత 350 మందికి రూ.1,52,62,500 వైఎస్సార్ ఆసరా 556 మందికి రూ. 1,52,48,123 వైఎస్సాఆర్సీ సున్నావడ్డీ 787 మందికి రూ.42,71,020 వైఎస్సార్ కాపు నేస్తం 74 మందికి రూ. 30,45,000 వైఎస్సార్ ఈబీసీనేస్తం 14 మందికి రూ.



3,60,000 డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ 172 మందికి రూ. 1,06,11,192 డా.వైఎస్సార్ ఆరోగ్య ఆసరా 96 మందికిరూ. 8,89,850 హౌసింగ్ (లబ్దిదారులకు నేరుగా చెల్లింపులు) 123 మందికిరూ.1,37,18,172 వైఎస్సార్ బీమా 14 మందికిరూ. 24,30,000 వైఎస్సార్వాహనమిత్ర 78 మందికి రూ. 22,50,000 వైఎస్సార్ నేతన్న నేస్తం 68 మందికి రూ. 46,80,000 జగనన్న చేదోడు (రజికులు, టైలర్లు, నాయీబ్రాహ్మణులు) 13 మందికి రూ. 3,40,000 వైట్కార్డు హోల్డర్లకు ప్రత్యేక కోవిడ్ 1,385 మందికి రూ.13,85,000 జగనన్న తోడు (వడ్డీ) 254 మందికి రూ. 1,48,272 ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) మొత్తం మందికి 6,371రూ. 21,08,94,631 పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ) ఇంటి స్థలాలు (భూ సేకరణ & 1 భూమి అభివృద్ధికి చెల్లించిన పరిహారం) 203 మందికి రూ.4,99,38,000 జగనన్న విద్యాకానుక 330 మందికి రూ. 23,43,660 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ 42 మందికి రూ. 5,55,324 జగనన్న తోడు (రుణాలు) 302 మందికి రూ. 56,22,938 జగనన్న గోరుముద్ద 327 మందికి రూ. 32,39,5896) వైఎస్సార్ సంపూర్ణ పోషణ 342 మందికి రూ. 64,05,660, ఇంటింటికి రేషన్ 1,481 మందికి రూ. 3,23,50,964 పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ) 3,027 మందికి రూ.10,04,56,135 డీబీటీ + నాన్ డీబీటీ మొత్తం మందికి 9,398 రూ. 31,13,50,766 మొత్తాన్ని అందజేశావని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు..పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, శివుని నరసింహారెడ్డి, రామిరెడ్డి మల్లికార్జున్ రెడ్డి నలుబోలు సుబ్బారెడ్డి అత్తిపల్లి అనూప్ రెడ్డి, వంగవరపు విజయసేన రెడ్డి ఎర్రంరెడ్డి ఆదినారాయణ దేవరపల్లి జనార్దన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, అబ్బాయి రెడ్డి, వినోద్ రెడ్డి, నితీష్ కిరణ్ శ్రీనివాసులు, ఎస్టీ సెల్ నేత కవరగిరి ప్రసాద్. జడ్పీటీసీ శ్రీలత, మరియు స్థానిక నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఏఎమ్‌సీ చైర్మెన్ బెజవాడకు మడపర్తి పలువురు నేతలు సన్మానం



**విడవలూరు, (రాజధాని వార్తలు):** టీడీపీలో బాల్య దశ నుండి పార్టీ బలోపేతం కొరకు కష్టపడిన ఊటుకూరు గ్రామానికి చెందిన బెజవాడ వంశీ కృష్ణ రెడ్డికి కోవూరు ఏఎమ్‌సీ చైర్మెన్ పదవి బాధ్యతలను చేపట్టారు. టీడీపీ నేతలు, ప్రముఖ న్యాయవాది నోటరీ, మడపర్తి రవీంద్ర నాయకత్వంలో పలువురు టీడీపీ నేతలు, కృష్ణ మూర్తి, స్థానిక నాయకులు కూటమి నేతలు వంశీకి పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో సత్కారం చేసి వంశీ చేసిన మేలును వివరించారు.

# ఏఎమ్‌సీ చైర్మెన్ వంశీకి వెల్లువెత్తిన శుభాకాంక్షలు

### - వంశీకి ఉన్న మంచే పదవి వరించింది : టీడీపీ సీనియర్ టంగుటూరు మల్లారెడ్డి

**కోవూరు, (రాజధాని వార్తలు):** ఊటుకూరు గ్రామానికి చెందిన బెజవాడ వంశీ కృష్ణ రెడ్డికి ఉన్న మంచే ఆయనకు ఏ ఎమ్ సీ పదవి వరించందని బుచ్చి టీడీపీ సీనియర్ నేత మల్లారెడ్డి అన్నారు కోవూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెజవాడ వంశీకృష్ణారెడ్డికి బుచ్చి మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు టంగుటూరు మల్లారెడ్డి పలువురు పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



# వికాస్ కృష్ణ వంశీ రెడ్డికి టీడీపీ నేత రాఖీ శుభాకాంక్షలు



**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ, నూతన చైర్మన్గా నియమితులు అయిన బెజవాడ వికాస్ వంశీ కృష్ణారెడ్డికి కోవూరు మండల పడుగుపాడు తెలుగుదేశం పార్టీ నాయకులు విన్నకోట (రాఖీ) రాధాకృష్ణ, టీడీపీ పడుగుపాడు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించాలని రాఖీ ఆకాంక్షించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిలకు టీడీపీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

# కోవూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

**కోవూరు, (రాజధాని వార్తలు):** ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతమ్మ ఆదేశాలతో, జొన్నవాడ దేవస్థానం చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి సూచనలతో రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో భాగంగా పోతిరెడ్డి పాలెం గ్రామంలో ఐ 2 ఐ ప్రోగ్రామ్ నిర్వహించి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేసిన అభివృద్ధి మరియు సంక్షేమం గురించి ప్రజలకు వివరించడము జరిగింది. స్థానిక సమస్యలను నమోదు చేసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో కోవూరు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి యద్దలపూడి నాగరాజు నెల్లూరు పార్లమెంటు కార్యదర్శి కృష్ణ ప్రసాద్ కోవూరు మండల మైనార్టీ ప్రెసిడెంట్ షేక్ జహంగీర్ యూనిట్ ఇంచార్జ్ నాగరాజు, బూత్ ఇంచార్జ్, షేక్ వాహిద్ ఇలపాక శివ ప్రసాద్, ముప్వల వెంకటేశ్వర్లు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# టీడీపీ నేత ఇలపాక ఇంటింటి ప్రచారం





**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, వేమిరెడ్డి ప్రశాంతమ్మ ఆదేశాలతో, జొన్నవాడ దేవస్థానం చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి సూచనలతో రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో భాగంగా పోతిరెడ్డి పాలెం గ్రామంలో చంద్రశేఖరపురం పరిధిలో డి 2 డి ప్రోగ్రామ్ నిర్వహించి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేసిన అభివృద్ధి మరియు సంక్షేమం గురించి వివరించి స్థానిక సమస్యలను నమోదు చేసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో పోతిరెడ్డి పాలెం గ్రామ ఉపాధ్యక్షులు వెన్నపూస ఓబుల్ రెడ్డి 87 బూత్ కన్వీనర్, ఇలపాక శివప్రసాద్, కార్యకర్తలు కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.



# ఇంటింటి ప్రచారంలో కుడితిపాలెం టీడీపీ నాయకులు

**ఇందుకూరు పేట, (రాజధాని వార్తలు):** కోవూరు నియోజకవర్గం అభివృద్ధి ప్రదాత దైవంలాంటి కోవూరు శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం కుడితి పాలెం గ్రామం ముసలారెడ్డి పాలెంలో ఉన్న 100 ఇళ్లకు వెళ్లి గడిసిన 2 సంవత్సరాలలో తెలుగుదేశం పార్టీ చేసిన కార్యక్రమాలు ప్రజలకు వివరించడం జరిగింది. అలాగే మై టిడిపి యాప్‌లో అప్లోడ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు అప్పాని శ్రీనివాసులు, మండల కార్యదర్శి ఇస్మాయిల్, రైతు విభాగం నాయకులు యల్లం శ్రీనివాసులు రెడ్డి, కోవూరు నియోజక వర్గం తెలుగు యువత వైస్ ప్రెసిడెంట్ దొడ్ల మల్లికార్జున్, గ్రామ కార్యదర్శి చెన్నయ్య, మురళి. ప్రవీణ్. సుబ్రహ్మణ్యం.



సుధీర్, లోకేష్ మరియు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు, కోవూరు నియోజకవర్గం వేమిరెడ్డి పుణ్య దంపతులు తోనే సాధ్యం అని కుడితి పాళెం టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేసారు.

# ఆణిముత్యంలాంటి బెజవాడ వంశీకి ఏఎమ్‌సీ చైర్మెన్ నియామకం పట్ల మత్స్యకార నేతలు హర్షం

### - వంశీకి ఈ పదవి రావడంతో టీడీపీ శ్రేణులు సంబరాలు




**విడవలూరు, (రాజధాని వార్తలు):** చిన్న వయసు నుండి టీడీపీలో కార్యకర్త నుండి మండలం స్థాయి, నియోజకవర్గం స్థాయి వరకు పార్టీలో అంచెలు అంచెలుగా ఎదిగి కూటమి ప్రభుత్వంలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అండతో బెజవాడ వంశీకి ఏ ఎమ్‌సీ చైర్మెన్ పదవి రావడం హర్షనీయమని బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల జనార్దన్ రావు అన్నారు. ఆయనతో పాటు టీడీపీ మత్స్యకార నేతలు కూడా హర్షం వ్యక్తం చేసారు. వంశీని మర్యాద పూర్వకంగా కలుసుకొని శాలువాతో సత్కరించి పూలమాల వేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, రామతీర్థం రామలింగేశ్వర స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులు కటారి సుబ్రహ్మణ్యం, వరిణి చెరువు సాగునీటి సంఘ అధ్యక్షులు ఆవుల రవిచంద్ర, టీడీపీ నాయకులు, కడియాల రాము, శ్రీహరి కోట రవి, పలువురు టీడీపీ నాయకులు, ఉప్పల వెంకట రమణయ్య, మాడా నరేంద్ర, ఉప్పాల శీనయ్య, పురిణి కృష్ణయ్య, తంబి శ్రీనివాసులు, హరిబాబు, మారుబోయిన రవి, తదితరులు ఉన్నారు.

# కోవూరు నూతన ఏఎమ్‌సీ చైర్మెన్ వంశీ కృష్ణ రెడ్డికి రామతీర్థం, పలువురు టీడీపీ నేతలు శుభాకాంక్షలు

**విడవలూరు, (రాజధాని వార్తలు):** కృషితో నాస్తి దుర్భిక్షం అన్న రీతిలో నాటి నుండి నేటి వరకు టీడీపీలో ఉంటూ పార్టీ బలోపేతం కొరకు కృషి చేసిన బెజవాడ వంశీ కృష్ణ రెడ్డి నూతనంగా కోవూరు ఏఎమ్‌సీ చైర్మెన్ పదవి బాధ్యతలను చేపట్టిన నేపథ్యంలో రామతీర్థం టీడీపీ నేతలతో పాటు బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల జనార్దన్ రావులు వంశీకి బొకే ఇచ్చి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వనమాల మాట్లాడుతూ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు వంశీ చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉన్నారు.



# నెల్లూరు నగరంలో పింఛన్ల పండుగ

## - ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ - రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగిన మంత్రి - ప్రభుత్వ రెండేళ్ల సుపరిపాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన నగర ప్రజానీకం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ పండుగ వాతావరణంలో జరిగింది. నెల్లూరు నగరంలోని 4వ డివిజన్ దీనదయాళ్ నగర్‌లో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి వారి ఆనందోత్సాహాల మధ్య అందించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులను ఆప్యాయంగా పలకరిస్తూ ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ పరిస్థితులను తెలుసుకున్న మంత్రి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి సక్రమంగా అందుతున్నదా అని ఆరా తీశారు. అనంతరం కూటమి ప్రభుత్వ రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా దీనదయాళ్ నగర్‌లో రెండు నెలల్లో ఎండ్ టు ఎండ్ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజలు అడగకుండానే అభివృద్ధి పనులు చేపడుతున్న మంత్రి నారాయణకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి స్వయంగా ఇంటి వద్దకు వచ్చి పెన్షన్ అందజేయడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబానికి పెన్షన్, 'తల్లికి వందనం', ఉచిత గ్యాస్ సిలిండర్లు, 'నారాయణ సైకిళ్లు' వంటి పథకాల ప్రయోజనాలు అందుతున్నాయని చెబుతూ ప్రభుత్వానికి, మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ, ప్రతి నెల ఒకటో తేదీ అంటే ప్రజలకు గుర్తొచ్చేది ఎన్టీఆర్ భరోసా పెన్షన్లేనన్నారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం పెన్షన్ల పంపిణీ కోసం నెల్లూరుకు వచ్చినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే సామాజిక పెన్షన్‌ను ఒకేసారి రూ.4,000కు పెంచి అమలు చేశామని, గత ప్రభుత్వం దశలవారీగా పెంపు చేపట్టగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వెంటనే అమలు చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు నెలలో 62.07 లక్షల మంది లబ్ధిదారులకు రూ.2,712.84 కోట్ల పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.71,312 కోట్లు పెన్షన్ల కోసం ఖర్చు చేసిందన్నారు. రాష్ట్ర జనాభాలో 12.88 శాతం మందికి ఏటా సుమారు రూ.33 వేల కోట్ల వ్యయంతో పెన్షన్లు అందిస్తున్న ప్రభుత్వం దేశంలో మరెక్కడా లేదని పేర్కొన్నారు. దివ్యాంగులకు రూ.6 వేల, పూర్తి వికలాంగులకు రూ.15 వేల, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.10 వేల పెన్షన్లు అందిస్తున్నట్లు వివరించారు. నెల్లూరు జిల్లాలో ఈ నెల 2,86,106 మంది లబ్ధిదారులకు రూ.126.36 కోట్ల పెన్షన్లు మంజూరు చేయగా, నగర పాలక సంస్థ పరిధిలో 45,041 మందికి రూ.19.88 కోట్లు, నెల్లూరు సిటీ నియోజకవర్గంలో 20,305 మందికి రూ.8.91 కోట్లు, ఒక్క 4వ డివిజన్‌లోనే 1,228 మందికి రూ.54.19 లక్షల పెన్షన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు, ఏసీ బస్ స్టాప్‌లను మూసివేసి రాష్ట్రాన్ని భారీ అప్పుల్లోకి నెట్టిందని ఆరోపించిన మంత్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిన పడుతోందన్నారు. ఇప్పటికే 16 వేల మందికి మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు కల్పించామని, త్వరలో జాబ్ క్యాలెండర్‌ను కూడా విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ నందన్, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నగర టీడీపీ అధ్యక్షుడు మామిడాల మధు, మహిళా నేతలు విజేతా రెడ్డి, పొత్తూరు శైలజ, డివిజన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలతో నాకాబంది, లాడ్జి చెకింగ్ నిర్వహించిన నెల్లూరు పోలీసులు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లా ఎస్పీ డా.అజిత వేజెండ్ల, ఐపిఎస్ ఆదేశాలు మేరకు తేదీ. 01.08.26 సాయంత్రం 7:00 నుంచి 09:00 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నాకాబంది నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో మొత్తం 215 మంది అధికారులు మరియు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు జిల్లాలోని ప్రధాన కూడళ్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, అనుమానితుల నివాసాలు, వాణిజ్య సముదాయాలు, జాతీయ రహదారులు, జిల్లా ప్రవేశ మరియు నిష్క్రమణ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టాయి. ఈ తనిఖీలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించి, ఓపెన్ డ్రింకింగ్ కేసులు - 23, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు - 35, మోటారు వాహన చట్టం కింద కేసులు - 312, నమోదు చేయడంతో పాటు, మొత్తం రూ.1,35,700/- జరిమానాలు విధించబడ్డాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రౌడీ షీటర్లు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో పట్టణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడం, రాత్రి సమయాల్లో రోడ్లపై ప్రశాంత వాతావరణం నెలకొల్పడం లక్ష్యంగా పోలీసులు సమగ్ర చర్యలు చేపడుతున్నారు. అదేవిధంగా, నేరాలకు అవకాశం ఉన్న ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలను మరింత తీవ్రతరం చేయడంతో పాటు, రాత్రి వేళల్లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే రౌడీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రైమ్ ప్రోన్ ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల సహాయంతో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, ఓపెన్ డ్రింకింగ్, పేకాట, గంజాయి వినియోగం మరియు అక్రమ వ్యాపారాలు, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్, దొంగతనాలు, రహదారి ప్రమాదాలు తదితర అసాంఘిక కార్యకలాపాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, రౌడీయిజం లేదా అనుమానాస్పద కదలికల గురించి సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు, డయల్-100/112కు లేదా జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 9392903143కు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే నేర నియంత్రణ మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని తెలిపారు.

# శృంగార వల్లభుని దర్శనానికి భారీగా భక్తులు - రూ. 2.12 లక్షలు ఆదాయం





**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండలం తొలి తిరుపతి క్షేత్రంలో శృంగార వల్లభ స్వామి దర్శనాలకు శనివారం భక్తులు పోటెత్తారు. ఈవో వడ్డీ శ్రీనివాసరావు, చైర్మన్ మొయిళ్ళ సంధ్యా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణ ఆచార్యులు, రవి ఆచార్యులు శ్రీ భూ సమేత శ్రీ శృంగార వల్లభ స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

దూర ప్రాంతాలనుంచి సైతం వేలాదిగా భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శిం చుకున్నారు. స్వామి వారి దర్శనాలకు వచ్చిన భక్తుల ద్వారా శనివారం ఒక్కరోజే రికార్డ్స్ స్థాయిలో రెండు లక్షల 12 వేల 161 రూపాయల ఆదాయం లభించినట్లు ఈవో వడ్డీ శ్రీనివాసరావు తెలిపారు. స్వామి దర్శనాలకు వచ్చిన భక్తులకు ఉదయం పులిహోర ప్రసా దాన్ని, మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. పెద్దాపురం డిఎస్పీ బాలగంగాధర్ తిలక్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించగా ఆయన శనివారం ఆలయంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, అధికారులు పాలక వర్గానికి తగు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. శతాబ్దాల చారిత్రిక ప్రాధా న్యత కలిగిన తొలి తిరుపతిలో శృంగార వల్లభ స్వామి దర్శనం సర్వ శుభకరమని అర్చకులు నారాయణచార్యులు తెలిపారు. దూర ప్రాంతాల నుండి స్వామి దర్శనాలకు వస్తున్న భక్తులకు షడ్రుచుల భోజన ప్రసాదాన్ని అందించడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తల్లి పాలే బిడ్డకు తొలి టీకా... తొలి ఆహారం... జీవితాంతం ఆరోగ్యానికి పునాది



**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి ఆదేశాల మేరకు హెల్త్ సూపర్వైజర్ కామరాజు పాంచాలినగర్‌లో గల అంగన్వాడీ కేంద్రంలో తల్లులకు మరియు వారి కుటుంబ సభ్యులకు "తల్లిపాలే అమృతం – ఆరోగ్యవంతమైన తల్లి,ఆరోగ్యవంతమైన శిశువే సమాజానికి బలమైన పునాది" అని ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఆగస్టు 1-7సందర్భంగా అవగాహన కల్పించారు. "తల్లి పాలే బిడ్డకు తొలి టీకా... తొలి ఆహారం... జీవితాంతం ఆరోగ్యానికి పునాది." ప్రతి శిశువుకు జన్మించిన క్షణం నుంచే తల్లి పాలను అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్తు నిర్మించవచ్చని తెలిపారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుండి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్స వాలు నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని, పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలని, శిశువు పుట్టిన వెంటనే మొదటి గంటలోపు తల్లిపాలు ఇవ్వడం అత్యంత ముఖ్యం మరియు అదే శాస్త్రీయమని, ఈ సమయంలో వచ్చే ముర్రు పాలు కొలస్ట్రం అనే బంగారు రంగులో ఉండేవి అమూల్యమైన పాలని, ఇవి సహజ వ్యాక్సిన్‌లా పనిచేసి శిశువుకు జీవితకాలపు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని వివరించారు. మొదటి ఆరు నెలలు-తల్లిపాలే సంపూర్ణ ఆహారం, శిశువుకు ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప నీరు, తేనె, గ్లూకోజ్ నీరు, గోవు పాలు, ఫార్ములా పాలు, కషాయాలు లేదా ఇతర ఆహారం ఏదీ ఇవ్వరాదని, తల్లిపాలలో శిశువుకు అవసరమైన నీరు, పోషకాలు, విటమిన్లు,ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉంటాయని పేర్కొన్నారు. ఆరు నెలలు పూర్త యిన తర్వాత తల్లిపాలతో పాటు వయస్సుకు తగిన పరిపూరకమైన కుటుంబ ఆహారంతో పాటు తల్లిపాలు కొనసాగించాలని పేర్కొన్నారు. ఆరు నెలల తర్వాత పరిపూరక ఆహారం ప్రారంభించినా, రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలు కొనసాగించడం శ్రేయస్కరమన్నారు. తల్లి పాల వల్ల బిడ్డకు సంపూర్ణ పోషకాహారమందుతుందని రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుందని, విరేచనాలు, న్యూమోనియా చెవి ఇన్ఫెక్షన్లు వంటి వ్యాధులుండవని, మెదడు ఎదుగుదల మెరుగుపడి శిశువు లలోసరైన బరువు, ఎత్తు పెరుగుదల ఉంటుందన్నారు. అలర్జీలు, ఊబకాయం, మధు మేహం వంటి వ్యాధుల ప్రమాదం తగ్గడమే కాక తల్లి-బిడ్డల మధ్య భావోద్వేగ అనుబంధం బలపడుతుందని అంతేకాకుండా తల్లికి కలిగే ప్రయోజనాల విషయానికి వస్తే ప్రసవానంతరం రక్తస్రావం తగ్గి గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి రావడం, రొమ్ము, అండాశయ క్యాన్సర్ల ప్రమాదం తగ్గడం, గర్భాల మధ్య సహజ విరామానికి దోహదం చేస్తుందన్నారు. పాలు ఇస్తున్న తల్లులు మంచి పోషకాహారం, రోజుకు తగినంత నీరు, ఆకుకూరలు, పప్పులు, పాలు, గుడ్లు, పండ్లు, ధాన్యాలు తీసుకోవాలని, మద్యం, పొగాకు, పొగ త్రాగడంలాంటి అలవాట్లు ఉంటే పూర్తిగా మానాలని, వైద్యుల సూచన లేకుండా ఎలాంటి మందులు వాడరాదని పేర్కొన్నారు. ముర్రుపాలు హానికరం కాదని, నిజానికి ముర్రు పాలే బిడ్డకు మొదటి వ్యాధి నిరోధక టీకాగ పేర్కొన్నారు. వేసవిలో బిడ్డకు నీరు తప్పకుండా త్రాగించాలనే అపోహ వద్దని, నిజానికి ఆరు నెలల వరకు తల్లిపాలలోనే తగినంత నీరు బిడ్డకు లభిస్తుందని తెలిపారు. తల్లికి జలుబు చేస్తే బిడ్డకు పాలు ఇవ్వకూడదు అనే అపోహ తగదని, నిజానికి ప్రత్యేకమైన సందర్భాల్లో తప్ప తల్లిపాలు కొనసాగించవచ్చని, అవసరమైతే వైద్యుల సలహా తీసుకోవాలన్నారు. బిడ్డకు పాలు ఇవ్వడం కేవలం తల్లి బాధ్యత మాత్రమే కాదు. కుటుంబ సభ్యులు, ఆరోగ్య సిబ్బంది, ఉద్యోగ సంస్థలు, సమాజం కలిసి తల్లులకు అనుకూల వాతావరణాన్ని కల్పించాలని, కార్యాలయాల్లో తల్లిపాల గదులు,ప్రసూతి సెలవులు, కుటుంబ సభ్యుల సహకారం వంటి అంశాలు తల్లిపాల విజయానికి ఎంతో అవసరమని" తల్లిపాలే శిశువుకు అమృతం...ఆరోగ్యవంతమైన జీవితానికి ఆరంభం." అని అవగాహన కల్పించారు. ప్రతి తల్లి తన బిడ్డకు తొలి గంటలోనే తల్లిపాలు ప్రారంభించి, మొదటి 6 నెలలు పూర్తిగా తల్లిపాలే అందించి, రెండు సంవత్సరాల వరకు కొనసాగిస్తే ఆరోగ్యవంతమైన తరం నిర్మాణంలో కీలక పాత్ర పోషించినవారు అవుతారనడంలో ఎలాంటి సందేహం లేదని హెల్త్ సూపర్వైజర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ అమ్ములు, ఎఎన్ఎం రేవతి, ఆశా కార్యకర్త శివనాగలక్ష్మి, తల్లులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

## - గతంలో తండ్రి తరుపున ఓడలరేవు వీఆర్వోగా విధులు నిర్వహించిన రాజు



**అల్లవరం, (రాజధాని వార్తలు):** మొగళ్ళ మూరు వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం కోమరగిరిపట్నం గ్రామానికి చెందిన మెట్ల వెంకట బాలరాజు (రాజు) (34) మొగళ్ళమూరు వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గుడ్డివాని చింత సమీపంలోని సత్య కస్తూరి కన్వెన్షన్ హాల్లో జరిగిన అల్లవరం తహసిల్దార్ ఎల్ వి నరసింహారావు పదవీ విరమణ సన్మాన సభకు హాజరైన రాజు సన్మాన సభ అనంతరం మోటార్ సైకిల్‌పై ఇంటికి బయలుదేరాడు. మొగళ్ళమూరు స్పీడ్ బ్రేకర్ల వద్ద మోటార్ సైకిల్ అదుపు తప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. గతంలో రాజు తండ్రి ఓడలరేవు విఆర్ఓగా పని చేయగా తండ్రికి సహాయకునిగా రాజు విధులు నిర్వహించారు. రాజు మరణ వార్త కొమరగిరిపట్నం, ఓడలరేవు గ్రామాలలో తీవ్ర విషాదాన్ని నింపింది. రాజు కుటుంబాన్ని గుంటూరు నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ ఏళ్ల దొరబాబు, జనసేన నాయకులు గునిశెట్టి చినబాబు పలువురు నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# శ్రీ లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు



**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు మండలం కుందకూరు కనుమరాయకొండపై వెలసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో పౌర్ణమి అనంతర శనివారం సందర్భంగా స్వామి వారికి, అమ్మవారికి విశేష అలంకరణలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ సుదర్శన నరసింహ యాగం పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తుల గోవింద నామస్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

# సంపాదకీయం

## భారతీయ బహుళత్వమే నియంతృత్వం నుంచి రక్ష!

జాతీయ రాజ్యం ఏర్పాటులోనే నియంతృత్వానికి సంబంధించిన బీజాలు అంతర్గతంగా ఉన్నాయి. అయితే, భారతదేశంలో శతాబ్దాలుగా వర్థిల్లిన స్థానిక సంప్రదాయక బహుళత్వం ఆ నియంతృత్వాన్ని ఒక పెద్ద వృక్షంగా ఎదగకుండా అడ్డుకుంటూ వచ్చింది. జాతీయవాదం, జాతీయ రాజ్యం అనేవి కాలక్రమేణా కేంద్రీకృత నియంతృత్వానికి దారితీస్తాయని రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి వారు స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోనే గుర్తించి హెచ్చరించారు. గాంధీ కూడా ఈ ప్రమాదాన్ని గ్రహించి, బహుళత్వాన్ని జాతీయవాదంతో మిళితం చేయడానికి ప్రయత్నించారు. భారత రాజ్యాంగం పౌరులకు జీవించే హక్కు, మాట్లాడే హక్కు వంటి ప్రాథమిక హక్కులను హామీ ఇచ్చింది. కానీ, జాతీయ రాజ్యానికి భౌగోళిక సరిహద్దులు ఎంత ముఖ్యమో, పౌరుల హక్కులపై రాజ్యానికి ఉండే నియంత్రణకూ అంతే బలమైన సరిహద్దులు ఏర్పడ్డాయి. ఆ సరిహద్దుల పేరే 'ప్రివెంటివ్ డిటెన్షన్ లా' (నిరోధక నిర్బంధ చట్టం). భౌతికశాస్త్రంలో 'బ్లాక్ హోల్'లో సర్వ భౌతిక సూత్రాలు ఎలాగైతే విఫలమవుతాయో, ఈ ప్రివెంటివ్ డిటెన్షన్ పరిధిలోకి వచ్చాక పౌరులకు రాజ్యాంగం ఇచ్చిన అన్ని ప్రాథమిక హక్కులు పోతాయి. సాధారణ చట్టాల ప్రకారం ఒక వ్యక్తిని అరెస్టు చేసినప్పుడు లభించే కనీస రక్షణలు కూడా ఇందులో ఉండవు. రాజ్యాంగంలోని ఈ నిబంధనల నుంచి పుట్టిన సంతానమే నేటి ఉపా వంటి నల్ల చట్టాలు. న్యాయస్థానాలు, ప్రభుత్వాలు చేతులు కలిపి ప్రజల హక్కులను నిరాకరించడం భారత చరిత్రలో కొత్తేమీ కాదు. కానీ, నేడు పౌర సమాజంలో పెరిగిన హిందూత్వ భావజాలం, హిందూ జాతీయవాదం ఇటువంటి ప్రజావ్యతిరేక చట్టాలకు, రాజ్య హింసకు పౌరుల నుంచే ఒక విస్తృతమైన 'సమ్మతి' లభించేలా చేస్తున్నాయి. అసలైన ప్రమాదం ఇక్కడే పొంచి ఉంది. అంబేడ్కర్, నెహ్రూలతో సహా ఆధునిక భారత నిర్మాతలంతా కేంద్రీకృత రాజ్యాన్ని గత సమాజంలోని మూర్ఖత్వాలు, సంకుచితత్వాలు, భూస్వామ్య దొరతనం, కులతత్వం నుంచి లభించే విముక్తిగా భావించారు. ఆ విముక్తి కోసమే వారు కేంద్రీకృత రాజ్యాన్ని బలపరచాలని నమ్మారు. ఆ రాజ్యాన్ని నిలపడం కోసం, దేశ సమగ్రత కోసం అవసరమైతే పౌరుల హక్కులను కుదించవచ్చని వారు భావించారు. దాని ఫలితమే రాజ్యాంగంలో నిర్బంధ చట్టాలకు చోటు దక్కడం. దీనివల్ల భారతదేశంలో ప్రభుత్వాలు అనేకసార్లు పేదలు, మైనారిటీల పట్ల వివక్షాపూరితంగా వ్యవహరించాయని మేధావులు, జర్నలిస్టులు నిరంతరం స్పష్టం చేస్తూనే ఉన్నారు. రాజ్యం రహస్యంగా హక్కులను హరించడం ఒక ఎత్తయితే, ఇప్పుడు పౌర సమాజంలోనే ఆ హక్కులు హరించడాన్ని సమర్థించేలా ఒక ఉన్మాద భావజాలం వ్యాప్తి చెందడం పెద్ద విషాదం. భారతదేశ ఆత్మ నిలబడింది ఇక్కడి వైవిధ్యంలో. మన సాంస్కృతిక, ఆధ్యాత్మిక చరిత్రను పరిశీలిస్తే, భారతీయ భక్తి మార్గం దేవుడిని ఒక సర్వాధికారిగా చూడలేదు. ఇక్కడ దేవుడు స్నేహితుడు (సఖుడు), ప్రియుడు, బిడ్డ, ఆఖరికి వాదనకు దిగే ఒక తోటివాడిగా కనిపిస్తాడు. భగవంతుడితో పౌరుడికి ఉండే సంబంధం స్వేచ్ఛతో కూడుకున్నది. కానీ, పాశ్చాత్య ప్రొటెస్టెంట్ లేదా అబ్రహామిక్ మత భావనలలో 'ప్రభువు' అనే భావన ప్రధానమైనది. అక్కడ దేవుడంటే సర్వశక్తిమంతుడు, ఆజ్ఞలు జారీ చేసేవాడు, భయపడి లొంగిపోవాల్సిన ఒక పాలకుడు. స్వేచ్ఛను భరించలేని ప్రజలు నియంతను ఆశ్రయించే అవకాశం ఉంటుందని ఎరిక్ ఫ్రామ్ అనే తత్వవేత్త చెప్పారు. నేటి హిందూత్వ భావజాలం భారతీయ భక్తి మార్గంలోని ఈ లలితమైన బహుళత్వాన్ని, స్వేచ్ఛను పూర్తిగా తుడిచిపెడుతోంది. ఇది పాశ్చాత్య మతాలలోని 'ప్రభువు' భావనను అరువు తెచ్చుకుని, ఒక సర్వాధికారిని, ఒక నియంతను ఆరాధించే సంస్కృతిని హిందూ సమాజంలోకి చొప్పిస్తోంది. దేవుడిని సైతం ఒక రాజకీయ పాలకుడిగా, అధికార కేంద్రంగా మార్చే ప్రక్రియ ఇది. దీనివల్లే స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ఉన్న 'అన్ని మతాలు, సంస్కృతుల సమ్మేళనం' అనే స్పృహ నేడు వెటకారానికి గురవుతోంది. ఒకే చట్టం, ఒకే మతం, ఒకే ధర్మం, ఒకే రాజ్యం అనే ఏకశిలా మూస ఆలోచనలకు ప్రాధాన్యం పెరుగుతోంది. రాజ్యం కేంద్రీకృతమయ్యేకొద్దీ పౌరుడి హక్కులు ఎలా నలిగిపోతాయో అర్థం చేసుకోవడానికి మన ప్రాచీన రాజకీయ చారిత్రక పరిణామ క్రమమే ఉదాహరణ. మొదట వెలసిన మౌర్య సామ్రాజ్యం ఒక బలమైన కేంద్రీకృత మహా సామ్రాజ్యం. ఆ కాలానికి చెందిన కౌటిల్యుని 'అర్థశాస్త్రం' ప్రకారం... రాజ్యాన్ని నిలపడమే అన్నిటికంటే ప్రధాన లక్ష్యం. అక్కడ ధర్మం కంటే రాజ్యాధికారానిదే పైచేయి. అందుకే, వర్ణ వ్యవస్థలో ఉన్నత స్థానంలో ఉన్న బ్రాహ్మణుడు సైతం రాజద్రోహానికి లేదా రాజధిక్కారానికి పాల్పడితే అతనికి మరణ శిక్ష విధించవచ్చని అర్థశాస్త్రం నిర్దేశించింది. ఇంక సామాన్యుడి పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఈ వ్యవస్థలో పౌరుడి కంటే సామ్రాజ్య రక్షణే పరమావధి కాబట్టి, ఇందులో ఒక రకమైన 'మత్స్య న్యాయం' (రాజ్యాధికార బలం) అంతర్లీనంగా చట్టబద్ధమైంది. కానీ, మౌర్య సామ్రాజ్య పతనం తర్వాతి కాలంలో విస్తరించిన గ్రామీణ సమాజాలు, చిన్న చిన్న రాజ్యాల నేపథ్యంలో రూపుదిద్దుకున్న ధర్మశాస్త్రాలు, మనుస్మృతి వంటి స్మృతి గ్రంథాలు దీనికి భిన్నమైన వైఖరిని ప్రదర్శించాయి. ఈ గ్రంథాలలో వర్ణ/ కుల వివక్షలు, సామాజిక అసమానతలు తీవ్రంగా ఉన్న మాట నిజమే అయినప్పటికీ, ఇవి కేంద్రీకృత రాజ్యాధికార బలాన్ని లేదా 'మత్స్య న్యాయాన్ని' పూర్తిగా వ్యతిరేకించాయి. 'రాజు కంటే ధర్మమే గొప్పది' అని ఇవి స్పష్టం చేశాయి. ఈ స్మృతి గ్రంథాలు ఆర్థిక నేరాలలో కింది వర్ణాల కంటే, సమాజంలో ఎక్కువ బాధ్యత కలిగి ఉండాల్సిన బ్రాహ్మణుడికి, క్షత్రియుడికే ఎక్కువ శిక్షలను విధించాయి.

## మొదటి గంటలో తల్లి పాలకు అవగాహనే ముఖ్యం

### - తల్లిపాలు వారోత్సవాల ప్రారంభంలో పిడి లక్ష్మి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సమాజంలో తల్లిపాల ప్రాధాన్యతపై పూర్తి అవగాహన ద్వారానే పుట్టిన మొదటి గంటలో శిశువుకు తల్లిపాలు అందే విధంగా జిల్లా వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్టు జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి హెచ్ లక్ష్మి అన్నారు. ఆమె ఆధ్వర్యంలో సామర్లకోట చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ కార్యాలయంలో జిల్లాలోని అందరు సిడిపివోలు, అంగన్వాడీ సూపర్వైజర్లకు సమీక్షా సమావేశం, తల్లిపాల వారోత్సవాలు -2026 కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసెఫ్ పిలుపు మేరకు ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుండి 7 వరకు "ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు" నిర్వహించబడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పిడి తెలిపారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడమే కాకుండా, వ్యాధి నిరోధక శక్తిని పెంచి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడతాయన్నారు. అయితే దేశంలో నవజాత శిశువు జన్మించిన మొదటి గంటలో తల్లిపాలు 67 శాతం పిల్లలకు మాత్రమే అందుతు న్నాయని ఆమె అన్నారు. అలాగాక మిగిలిన పిల్లలకు కూడా పుట్టిన గంటలోపే తల్లిపాలు అందే దిశగా అవగాహన ప్రచారాన్ని చేపడుతున్నట్టు పిడి చెప్పారు. కాగా చిన్నారులకు మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం అత్యంత అవసరమని వైద్య నిపుణులు అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రశాంతి సూచించారు. అనంతరం రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం వరకు తల్లిపాలను కొనసాగిస్తూ, అనుబంధ ఆహా రాన్ని అందించాలి అని డా.రమ్యశ్రీ సూచించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, కుటుంబ సభ్యులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం, అపోహలను తొలగించడం, ఆరోగ్యకరమైన మాతా-శిశు సంరక్షణను ప్రోత్సహించడం లక్ష్యంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలోని ప్రజలందరూ తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి, ప్రతి శిశువుకు తల్లిపాలు అందేలా సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి జెస్సి, సీడీపీఓ జి ఉష, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ పి వెంకట లక్ష్మి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సి హెచ్ వెంకట్రావు, జిల్లాలోని అన్ని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓలు, సూపర్వైజర్లు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** బాల్య వివాహాల నివారణకు సంబంధిత శాఖల అధికారుల సమిష్టి కృషి అవసరమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఎం గంగ సూర్యనారాయణ, పెద్దాపురం ఆర్డీవో కృష్ణమూర్తిలు అన్నారు. జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ లక్ష్మి ఆధ్వర్యంలో పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) పి కృష్ణమూర్తి అధ్యక్ష తన పెద్దాపురం ఆర్డివో కార్యాలయంలో బాల్య వివాహ నిరోధక అధికారులకు డివిజనల్ స్థాయి అవగాహన, సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఎం గంగ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. బాలల హక్కుల పరిరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయడం అత్యంత అవసరమని, ముఖ్యంగా బాల్య వివాహాల నిర్మూలనలో రెవెన్యూ, పోలీసు, విద్య, ఐసీడీఎస్, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖలు పరస్పర సహకారంతో పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రతి బాల్య వివాహ సమాచారాన్ని అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి తక్షణ చర్యలు చేపట్టి, ప్రతి బాలుడి, బాలిక హక్కులను పరిరక్షించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కృష్ణమూర్తి మాట్లా డుతూ బాల్య వివాహాల నిర్మూలనకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే సంబంధిత అధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవ డంతో పాటు బాలల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టేందుకు కృషి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ లక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ ప్రతి శాఖ యొక్క ఉమ్మడి బాధ్యత అన్నారు. గ్రామ, మండల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి తల్లిదండ్రులు, విద్యార్థులు, యువత మరియు ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే రెవెన్యూ, పోలీసు, విద్య, ఐసీడీఎస్, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో స్పందించి వాటిని అడ్డుకోవాలని తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్ వెంకట్రావు మాట్లాడుతూ జి.ఓ. ఎంఎస్. నెం. 39, జి.ఓ. ఎంఎస్. నెం. 31 నిబంధనల ప్రకారం అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేసినప్పుడే గ్రామ, మండల స్థాయిలో బాల్య వివాహాలను సమర్థవంతంగా నిరోధించగలమన్నారు. బాల్య వివాహాల నివారణలో ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థవం తంగా నిర్వర్తిస్తూ పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పెద్దాపురం డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసిల్దార్లు, విద్యాశాఖ అధికారులు, సీడీపీవోలు, ఎస్‌హెచ్‌వోలు జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మరిడమ్మ అమ్మవారి 38 రోజుల ఆదాయం రూ. 23.46 లక్షలు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం ఇలవేల్పు అయిన శ్రీ మరిడమ్మ అమ్మవారి ఆలయానికి గత 38 రోజుల హుండీల ఆదాయం రూ. 23,46,290 వచ్చింది. దేవాదాయ తనిఖీదారు వీ ఫణీంద్ర కుమార్, కాకినాడ నూకల మాలయ అధికారి ఎం వీరభద్రరావు, ఆలయ ధర్మకర్త చింతపల్లి శ్రీహర్ష ల పర్యవేక్షణలో శనివారం గత 38 రోజుల హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారిణి, దేవాదాయ సహాయ కమిషనర్ కె విజయలక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన ఆలయ లెక్కింపులో ఆలయ కమిటీ సభ్యులు, భక్తమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొని సేవలు అందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన లెక్కింపు కార్యక్రమంలో హుండీల ద్వారా రూ. 23,00,938, అన్నదానానికి రూ. 46,352, వెరసి రూ. 23,46,290 ఆదాయం వచ్చినట్టు ఆలయ అధికారిణి విజయలక్ష్మి తెలిపారు.

## ఆడపిల్లల అక్రమ రవాణా అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు




**శ్రీకాళహస్తి టౌన్, (రాజధాని వార్తలు):** జిల్లా జడ్జి ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి చెన్నై రోడ్‌లో ఉండు ఎస్సీ హాస్టల్‌లో ఆడపిల్లల అక్రమ రవాణా అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రమేష్ బాబు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఏదైనా ఇస్తే తీసుకోకూడదని, అందరూ కలిసికట్టుగా స్కూలుకు వెళ్లి రావాలని తెలియజేశారు. అనంతరం న్యాయవాది గుమ్మల రాజేశ్వరరావు మాట్లాడుతూ ఉమెన్ ట్రాఫికింగ్ రాష్ట్రంలో ఎక్కువగా ఉందని, ఆడపిల్లలందరూ గుంపులుగానే స్కూళ్లకు వెళ్లి, గుంపులుగానే రావాలని తెలియజేశారు. మీకు ఏవైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు ఫోన్ చేసి మీ సమస్యను తెయజేయాలన్నారు. న్యాయ సేవా అధికార సంస్థ త్వరగా మీ సమస్యను సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కరిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గుమ్మల రాజేశ్వరరావు, గరికపాటి రమేష్ బాబు, హాస్టల్ వార్డెన్, విద్యార్థినులు పాల్గొన్నారు.

## కరప మండలంలో 91.34 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పూర్తి



**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శనివారం 91.34 శాతం పూర్తయినట్లు మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జటావల్లభుల శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలోని 21 గ్రామ సచివాలయాల ద్వారా మొత్తం 11,023 మంది లబ్ధిదారులకు రూ.4,80,91,500 పంపిణీ చేయాల్సి ఉండగా, శనివారం ఉదయం నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, ఇతర ప్రభుత్వ సిబ్బంది, కూటమి నాయకులు సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి 10,068 మంది లబ్ధిదారులకు రూ.4,34,11,500 విలువైన పింఛన్లను పంపిణీ చేశారు. వర్షాన్ని లెక్క చేయకుండా లబ్ధిదారులకు పింఛన్లు సకాలంలో చేరేలా కృషి చేసిన సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులను ఎంపీడీవో జె శ్రీనివాస్ అభినందించారు.

## సమస్యలపై ఎమ్మెల్యే వినతులు స్వీకరణ



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకుని వారి నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని ప్రాధాన్యతగా తీసుకుని, వాటి త్వరిత పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామన్నారు.

ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, మొయిళ్ళ కృష్ణమూర్తి, నూనె రామారావు, బడుగు శ్రీకాంత్, సాల్మన్ రాజ్, దేవళ్ళ సతీష్, జలధాని సుబ్రహ్మణ్యం, బోస్, ఏసు బాబు, రేలంగి వెంకటరావు, బొందల రామలక్ష్మీ, కొల్లి సునీత, గుత్తుల సూర్య వతి, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీ గురుకుల పాఠశాలకు వైర్‌లెస్ మైక్ సిస్టమ్ విరాళం



**కరప, (రాజధాని వార్తలు):** మండల కేంద్రం కరప స్థానిక బీసీ గురుకుల హాస్టల్ (ఎంజేపీ ఏపీబీసీడబ్ల్యూఆర్) పాఠశాలలో అసెంబ్లీ నిర్వహణ సమయంలో మైక్ సిస్టమ్ లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ కె. రామకృష్ణారావు కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై వెంటనే స్పందించి మేకా లక్ష్మణరావు, రాజ్యసభ సభ్యులు ఎంపీ సానా సతీష్ బాబు కార్యాలయ ఇన్‌చార్జిని సంప్రదించి, పాఠశాలకు రూ.10,500 విలువైన వైర్‌లెస్ మైక్ సిస్టమ్‌ను విరాళంగా అందేలా కృషి చేశారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మైక్ సిస్టమ్‌ను ప్రిన్సిపాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె. రామకృష్ణారావు మాట్లాడుతూ అసెంబ్లీతో పాటు పాఠశాలలో నిర్వహించే వివిధ విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలకు ఈ వైర్‌లెస్ మైక్ సిస్టమ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి సహకరించిన దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవు వెంకటేశ్వరరావు, బీసీ హాస్టల్ మాజీ చైర్మన్ మంచాల శ్రీనివాస్, పేపకాయల తణుకులు రాజు, సింగినీడి సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాజు గారు మరీ ఇంత స్లో అయ్యారేంటో..?



టాలీవుడ్‌లో టాప్ ప్రొడ్యూసర్స్ జాబితాలో దిల్ రాజు ముందు ఉంటారు అనడంలో సందేహం లేదు. తెలుగు నిర్మాతలు అంటే చాలా మంది పేర్లు వెంటనే వినిపిస్తాయి, అయితే యాక్టివ్ ప్రొడ్యూసర్స్‌లో దిల్ రాజు ముందు వరుసలో ఉంటారు. ఆయన బ్యానర్ నుంచి సినిమా వస్తుంది అంటే మినిమం గ్యారెంటీ అన్నట్లుగా ఉంటుంది అనడంలో సందేహం లేదు. ఆయన కథల ఎంపిక, దర్శకులను పిక్ చేసుకునే తీరు, కొత్త వారిని వెతికి పట్టుకునే తీరు ఇండస్ట్రీలో మరెవ్వరికీ లేదు అనే అభిప్రాయం చాలా మందికి ఉంది. అలాంటి దిల్ రాజు ఈ మధ్య కాలంలో స్లో అయ్యారు అంటూ ఆయన్ను అభిమానించే వారు, ఆయన జడ్జ్‌మెంట్‌ను ఇష్టపడేవారు అంటున్నారు. గత ఏడాది దిల్ రాజు బ్యానర్ నుంచి గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం, తమ్ముడు సినిమాలు వచ్చిన విషయం తెల్సిందే. గేమ్ ఛేంజర్, తమ్ముడు సినిమాలు నిరాశ పరచినా సంక్రాంతికి వస్తున్నాం భారీ వసూళ్లు రాబట్టి దిల్ రాజుకు లాభాల వర్షం కురిపించింది.

**సంక్రాంతికి వస్తున్నాంతో బ్లాక్ బస్టర్ హిట్..**

సంక్రాంతికి వస్తున్నాం సినిమా తర్వాత మళ్లీ అనిల్ రావిపూడితో సినిమాను చేయాలని దిల్ రాజు భావించినప్పటికీ ఆయనకు ఉన్న ఇతర కమిట్‌మెంట్స్ కారణంగా కుదరలేదు. దిల్ రాజు ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఒక్క సినిమాను విడుదల చేయలేదు. అందుకు కారణం గత ఏడాది కొత్త సినిమాలు మొదలు పెట్టక పోవడం అనే విషయం తెల్సిందే. ప్రస్తుతం విజయ్ దేవరకొండతో షూటింగ్ జరుగుతున్న రౌడీ జనార్ధన మూవీ మినహా మరేది కూడా సెట్స్ పై లేవని తెలుస్తోంది. వేణు దర్శకత్వంలో దేవి శ్రీ ప్రసాద్ హీరోగా ఎల్లమ్మ సినిమాను ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు సినిమా షూటింగ్ ఎప్పుడు అనే విషయంలో మాత్రం క్లారిటీ రాలేదు. ఇటీవల దేవి శ్రీ ప్రసాద్ పుట్టిన రోజు నేపథ్యంలో ఒక పోస్టర్‌ను విడుదల చేయడం జరిగింది. బర్త్‌డే సందర్భంగా ఆ పోస్టర్ వచ్చింది. కానీ దిల్ రాజు నుంచి మాత్రం సినిమా షూటింగ్ అప్‌డేట్ ఏమీ లేకపోవడంతో ఇండస్ట్రీ వర్గాల వారు సైతం ఆ సినిమా విషయమై క్లారిటీ లేదంటున్నారు.

**విజయ్ దేవరకొండ రౌడీ జనార్ధన...**

విజయ్ దేవరకొండతో ప్రస్తుతం నిర్మిస్తున్న సినిమా సైతం ఈ మధ్య మొదలు పెట్టిన సినిమా అసలే కాదు. ఆయన విజయ్ దేవరకొండతో గత ఏడాది ఆరంభంలోనే ఆ సినిమా అనుకున్నాడు. అనుకున్నట్లుగానే మొదలు పెట్టాడు, కానీ కొన్ని కారణాల వల్ల ఆలస్యం అవుతూ వచ్చింది. షూటింగ్ సైతం దిల్ రాజు గత చిత్రాల మాదిరిగా స్పీడ్ జరుగుతున్నట్లుగా అనిపించడం లేదు. అసలు రౌడీ జనార్ధన ఎప్పుడు వస్తుంది అనే విషయంలో ఇండస్ట్రీ వర్గాల్లోనూ క్లారిటీ ఉన్నట్లు కనిపించడం లేదు. దిల్ రాజు ఇండస్ట్రీలో నిర్మాతగా ఎంట్రీ ఇచ్చిన తర్వాత మరీ ఇంత సైలెంట్‌గా ఉండటం ఇదే ప్రథమం అంటూ కొందరు సోషల్ మీడియాలో మాట్లాడుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో ఆయన మీడియా అప్పియరెన్స్ సైతం పెద్దగా లేకపోవడంతో ఎందుకు దిల్ రాజు గారు సైలెంట్‌గా ఉంటున్నారు అంటూ పలువురు పలు రకాలుగా ప్రచారం చేస్తున్నారు.

**దిల్ రాజు పెద్ద సినిమాలతో...**

దిల్ రాజు ఒక వైపు పెద్ద సినిమాలను నిర్మిస్తూనే మరో వైపు తన ఫ్యామిలీ మెంబర్స్ కూతురు, శిరీష్ కొడుకు ద్వారా చిన్న సినిమాలను నిర్మిస్తున్న విషయం తెల్సిందే. బలగం దిల్ రాజు ప్లాన్ బి ప్రొడక్షన్ అనే విషయం తెల్సిందే. ఇంకా చాలా సినిమాలు ఆ బ్యానర్‌లో వచ్చే అవకాశం ఉంది. ఆ సినిమాలతో ఎక్కువ లాభాలను దిల్ రాజు అండ్ టీం ఆశిస్తున్నారట. అందుకే పెద్ద సినిమాల కంటే చిన్న సినిమాలపై ఎక్కువ దృష్టి పెట్టే ఉద్దేశంతో దిల్ రాజు పెద్ద సినిమాల విషయంలో స్లో అయ్యి ఉంటాడా అని చాలా మంది భావిస్తున్నారు. ఏది ఏమైనా దిల్ రాజు వరుసగా స్టార్ హీరోల సినిమాలను నిర్మించాల్సిందే అని కోరుకునే వారు చాలా మంది ఉన్నారు. ఈ ఏడాదిలో దిల్ రాజు బ్యానర్ నుంచి కనీసం ఒక్క మూవీ అయినా వస్తుందా అనేది అనుమానంగానే ఉంది. వచ్చే ఏడాదిలో అయినా రాజు గారు కనీసం మూడు నాలుగు సినిమాలు విడుదల చేయాలని ఆయన అభిమానులు కోరుకుంటున్నారు.

# ప్రభాస్ ఎంట్రీతో స్పీడ్ పెరిగిన షూటింగ్?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, క్లాసిక్ డైరెక్టర్ హను రాఘవపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'. ఇటీవల విడుదలైన ప్రభాస్ ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాను షేక్ చేయగా, తాజాగా ఈ ప్రాజెక్ట్ నుంచి వచ్చిన మైండ్ బ్లాకింగ్ అప్‌డేట్ రెబల్ స్టార్ అభిమానుల్లో పూనకాలు తెప్పిస్తోంది. సినిమా షూటింగ్ దాదాపు ముగింపు దశకు చేరుకోవడంతో పాటు ప్రీమియర్లపై నిర్మాత ఇచ్చిన క్లారిటీ ఇప్పుడు నెట్టింట హల్‌చల్ చేస్తోంది. ఈ సినిమా కోసం హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో పెద్ద చార్మినార్ సెట్ వేస్తున్నారు. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌కు తగ్గట్టుగా ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ సెట్‌ను రూపొందించారు. ఆగస్టు 3 నుంచి ప్రారంభమయ్యే ఈ కీలకమైన 25 రోజుల షెడ్యూల్‌లో ప్రభాస్ పాల్గొని టాకీ పార్ట్ సన్నివేశాల షూటింగ్‌ను పూర్తి చేయనున్నారు.

**90 శాతం షూటింగ్ కంప్లీట్:**

ప్రస్తుతం ప్లాన్ చేసిన ఈ 25 రోజుల సుదీర్ఘ షెడ్యూల్ పూర్తయ్యేసరికి, 'ఫౌజీ' సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం వరకు పూర్తవు తుందని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. హను రాఘవపూడి పక్కా ప్లానింగ్‌తో పనులు వేగంగా పూర్తి చేస్తుండటంతో మేకర్స్ చాలా హ్యాపీగా ఉన్నారు. ఇక విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ సరసన నయా బ్యూటీ ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తోంది.

**డిసెంబర్ 2 నుంచే ప్రీమియర్ షోలు:**

ప్రభాస్ ఫ్యాన్స్‌కు అత్యంత తీపి కబురు ఏంటంటే.. ఈ సినిమా ప్రపంచవ్యాప్త ప్రీమియర్ షోలు డిసెంబర్ 2 నుంచే ప్రారంభం కానున్నట్లు నిర్మాత అధికారికంగా వెల్లడించారు. థియేటర్లలోకి అసలైన రిలీజ్ డేట్ కంటే ముందే 'ఫౌజీ'ని చూసే అవకాశం దక్కడంతో సోషల్ మీడియాలో ప్రభాస్ అభిమానులు భారీ స్థాయిలో సంబరాలు చేసుకుంటున్నారు.

**యాక్షన్, ఎమోషన్, దేశభక్తి కలబోత:**

తనదైన ఫీల్ గుడ్ ఎమోషన్స్‌తో విజువల్ ట్రీట్ ఇవ్వడంలో హను రాఘవపూడి సిద్ధహస్తుడు. ఇక ఇప్పుడు ప్రభాస్ కటౌట్‌కు తగ్గట్టుగా యాక్షన్, లవ్, దేశభక్తి అంశాలను సమపాళ్లలో మేళవిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. త్వరలోనే టీజర్, మెలోడీ సాంగ్స్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

బాక్సాఫీస్ రికార్డులు తిరగరాయడం ఖాయం: ఫస్ట్ లుక్ నుంచి ప్రీమియర్ అప్‌డేట్ వరకు ప్రతీది పాజిటివ్ వైబ్‌ను క్రియేట్ చేయడంతో 'ఫౌజీ' సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. మేకర్స్ చూపిస్తున్న ఈ స్పీడ్ చూస్తుంటే డిసెంబర్ నెలలో థియేటర్లలో ప్రభాస్ సునామీ సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

# పూరికి ఇష్టమైన రంగులో ఛార్మీ!



ఇండస్ట్రీలో డైరెక్టర్ పూరి జగన్నాథ్- ఛార్మీ కౌర్ జోడీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇద్దరు మంచి స్నేహితులు..నిర్మాణంలో భాగస్వాములు. పూరి సినిమాలన్నింటిని ఛార్మీతో కలిసి నిర్మిస్తుంటారు. క్రియేటివ్ విభాగంలో కూడా చార్మీ అవసరం మేర పాలు పంచుకుంటారు. ఇద్దరి మధ్య మంచి అండర్ స్టాండింగ్ ఉంది. తాజాగా ఇద్దరి మధ్య ఓ పోలకి స్పష్టంగా కనిపిస్తుంది. ఇటీవల కాలంలో ఛార్మీ ధరించే దుస్తుల ఎంపికలో స్పష్టమైన మార్పు వచ్చింది. పూరి జగన్నాథ్ ఎక్కువగా ఇష్టపడే నలుపు రంగు వైపు ఆమె కూడా పూర్తిగా ఆకర్షితులవుతుండటం విశేషం. పూరి జగన్నాథ్ ఏ వేడుకలోనైనా? పబ్లిక్ అప్పియరెన్స్‌లోనైనా? ఎప్పుడూ బ్లాక్ అండ్ బ్లాక్ కాస్ట్యూమ్స్‌లోనే ఎక్కువగా కనిపిస్తుంటారు. నలుపు రంగుపై ఆయనకు ఉన్న మక్కువ ఎప్పటి నుంచో అందరికీ తెలిసిందే. పూరి డైరెక్షన్ స్టైల్ లాగే తన డ్రెస్సింగ్ స్టైల్‌లోనూ యూనిక్ బ్రాండ్‌ను మెంటైన్ చేస్తుంటారు. గత కొన్ని సంవత్సరాలుగా పూరి ట్రేడ్‌మార్క్ లుక్ ఇదేనని చెప్పొచ్చు. అయితే గతంలో రకరకాల రంగుల దుస్తులు, మోడ్రన్ ఫ్యాషన్ వేర్‌లో కనిపించిన ఛార్మీ కౌర్ ఇప్పుడు పూరి బాటలోనే నడుస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఛార్మీ ఏ ఫోటోషూట్‌లోనైనా? సినిమా ఈవెంట్లోనైనా? ఆఫీస్ మీటింగ్స్‌లోనైనా? పూర్తిగా బ్లాక్ అండ్ బ్లాక్ దుస్తులలోనే దర్శనమిస్తున్నారు. పూరి ఇష్టపడే ఈ రంగును ఛార్మీ కూడా దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం విశేషం. ఇద్దరి ఆలోచనా విధానంలో, పనితీరులో ఎంతటి సారుప్యత ఉందో వారి స్టైల్ స్టేట్‌మెంట్‌లోనూ అదే రిఫ్లెక్ట్ అవుతోందని చెప్పొచ్చు. ప్రొడక్షన్ హౌస్ బాధ్యతలను చూసుకుంటూ బిజినెస్ వ్యవహారాలను చక్కబెడుతున్న ఛార్మీ సింపుల్ అండ్ పవర్ ఫుల్ లుక్‌ను ఎంచుకోవడం వెనుక ఒక రకమైన ప్రొఫెషనల్ బాండింగ్ కనిపిస్తోందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. సెలబ్రిటీల లైఫ్ స్టైల్, వారి ఆహార్యం ఎప్పుడూ ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తుంటాయి. ఒకరికొకరు వ్యాపార భాగస్వాములుగా, మంచి స్నేహితులుగా ఉన్న జోడీ తమ శైలిలోనూ ఒకే రకమైన ప్రాధాన్యతలను పంచుకోవడం వారి మధ్య ఉన్న అవగాహనకు నిదర్శనంగా నిలుస్తోంది. నలుపు రంగులో ఇద్దరూ ఇస్తున్న వైబ్స్ సోషల్ మీడియాలోనూ ట్రెండ్ అవుతున్నాయి.

సినీ రంగంలో ఇలాంటి భావసారూప్యత కలిగిన వ్యక్తులు కలిసి పని చేయడం వారి ప్రయాణాన్ని మరింత బలోపేతం చేస్తుందనడంలో సందేహం లేదు. పూరి ఇష్టమైన రంగును ఛార్మీ కూడా తన సిగ్నేచర్ స్టైల్‌గా మార్చు కోవడంతో వారి స్నేహ బంధం ఎంత బలమైనదో తెలియ జేస్తోంది. త్వరలోనూ పూరి దర్శకత్వం వహిస్తోన్న స్లమ్ డాగ్ టెంపురన్ రిలీజ్ కానుంది.

# అనుపమ సోషల్ మీడియా గేమ్.. గాసిప్‌లను కూడా ప్లస్‌గా మార్చేసిందా?



అనుపమ పరమేశ్వరన్ గురించి రీసెంట్‌గా పర్సనల్ లైఫ్‌కు సంబంధించిన ఊహాగానాలు సోషల్ మీడియాలో డిస్కషన్ జరుగుతున్నప్పటికీ, ఆమె పబ్లిక్ ఇమేజ్‌ను పరిశీలిస్తే ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది. గాసిప్ చుట్టూ తిరిగే డిస్కషన్స్ కంటే తన కెరీర్, పర్సనల్ ఫ్రెండ్‌షిప్స్, ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్‌కే ఆమె ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే అభిప్రాయం ఇండస్ట్రీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. తాజాగా హీరోయిన్ నివేదా థామస్‌తో కలిసి అనుపమ కనిపించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడం ఆసక్తికరంగా మారింది. సినీ పరిశ్రమలో పోటీ ఎంత తీవ్రంగా ఉన్నా, కొన్ని బాండింగ్స్ మాత్రం ఏళ్ల పాటు కొనసాగుతుంటాయి. అనుపమ- నివేదా అనుబంధాన్ని కూడా అలాంటి లాంగ్‌టర్మ్ ఫ్రెండ్‌షిప్‌గానే ఫ్యాన్స్ చూస్తున్నారు. ఈ ఫోటోలు కేవలం ఇద్దరు హీరోయిన్లు కలిసి కనిపించారనే కారణంతో కాకుండా, అందులో కనిపించిన సహజత్వం, ఎలాంటి గ్లామర్ ప్లానింగ్ లేకుండా ఉన్న క్యాజువల్ మోమెంట్స్ వల్ల ఎక్కువ మందిని ఆకర్షించాయి. సెలబ్రిటీల విషయంలో నేచురల్ ఫోటోలు తరచుగా ఎక్కువ రెస్పాన్స్‌ను తెచ్చుకుంటాయి. దానికి కారణం అవి ప్రమోషనల్ కంటెంట్‌లా కాకుండా, వారి రియల్ లైఫ్‌లోని ఒక చిన్న మూమెంట్ లాగా కనిపించడం. ఫ్యాన్స్ కూడా అలాంటి కంటెంట్‌తో ఎక్కువగా కనెక్ట్ అవుతారు. అందుకే అనుపమ- నివేదా ఫోటోలకు సోషల్ మీడియాలో మంచి ఎంగేజ్‌మెంట్ లభించింది. ఇక్కడ మరో ఆసక్తికరమైన అంశం అనుపమ సోషల్ మీడియా స్ట్రాటజీ. ఆమె రెగ్యులర్‌గా ప్రమోషనల్ పోస్టులు, భారీ క్యాంపెయిన్‌లు చేయకపోయినా, సోషల్ మీడియాలో తన విజిబిలిటీని నిలబెట్టుకోగలుగుతోంది. దీనికి మెయిన్ రీజన్ సెలెక్టివ్ షేరింగ్. పర్సనల్ లైఫ్ ను పూర్తిగా మార్కెటింగ్ టూల్‌గా ఉపయోగించకుండా, అప్పుడప్పుడు షేర్ చేసే నేచురల్ ఫోటోలు, సినిమా అప్‌డేట్స్, ట్రావెల్ మోమెంట్స్ ద్వారా ఆమె ఆడియన్స్‌తో కనెక్షన్‌ను కొనసాగిస్తోంది.

తక్కువ ప్రమోషన్‌తో కూడా హై విజిబిలిటీ సాధించగల మోడల్‌గా ఆమె సోషల్ మీడియా ప్రెజెన్స్‌ను విశ్లేషకులు చూస్తున్నారు. మరోవైపు ఆమె ప్రొఫెషనల్ ఫోకస్ కూడా అదే ఇమేజ్‌ను బలపరుస్తోంది. కొత్త సినిమాలు, షూటింగ్ కమిట్‌మెంట్స్, భిన్నమైన పాత్రల ఎంపికపై ఆమె దృష్టి పెట్టడం వల్ల పర్సనల్ లైఫ్‌పై వచ్చే వార్తలు ఆమె కెరీర్ నేరేటివ్‌ను పూర్తిగా డామినేట్ చేయలేకపోతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో అనుపమకు సోషల్ మీడియా అనేది గాసిప్‌కు రియాక్ట్ అయ్యే ప్లాట్‌ఫామ్‌గా కంటే తన పనిని మరియు తన వ్యక్తిత్వాన్ని సమతుల్యంగా చూపించే కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్‌గా మారినట్టుగా కనిపిస్తోంది.

# కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించిన కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** దిగ్విజయంగా జరిగిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారం భోత్సవం కార్యక్రమం అనంతరం తిరుగు ముఖం పట్టిన వాహనా లను ఇతర ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి పర్యవేక్షించారు.
ప్రధాని పర్యటన కార్యక్రమం అనంతరం కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్ ను కలెక్టర్ సందర్శించారు.
సుమారు గంటపాటు అక్కడే ఉండి గమ్యస్థానా లకు వెళ్ళే వాహనాలను ఈఎంఎస్ ద్వారా పర్యవేక్షించారు. ప్రధాని పర్యటనకు సుమారు 4860 బస్సుల్లో జనం వచ్చారని, ఆ వాహనాల్లో వచ్చినవారంతా తిరిగి క్షేమంగా ఇంటికి చేరుకొనే వరకు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ రోణంకి గోపాల కృష్ణ, సెర్ప్ డైరెక్టర్ (అడ్మిన్) ఎ.కళ్యాణ్ చక్రవర్తి, ఇతర అధికారులు కూడా పాల్గొని పర్యవేక్షించారు.

# దేవుని పేరుతో అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు

## - హెచ్చరించిన ఎమ్మెల్యే సునీల్ కుమార్

**గూడూరు, (రాజధాని వార్తలు):** శ్రీకృష్ణ ధర్మరాజు స్వామి దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలను వ్యాపారులు ఇతరులకు విక్రయిస్తున్నారని, ఈ వ్యవహారంలో లక్షలాది రూపాయల అవినీతి జరిగిందన్న ఫిర్యాదులు ఎక్కువ సంఖ్యలో అందు తున్నాయని గూడూరు ఎమ్మెల్యే, రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ తెలిపారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని దేవాదాయ శాఖ మంత్రికి లేఖ పంపుతున్న ట్లు వెల్లడించారు. గూడూరు పాత బస్టాండ్ సమీపంలోని శ్రీకృష్ణ ధర్మరాజు స్వామి దేవస్థానంలో ఈ నెలలో నిర్వహించనున్న కుం భాభిషేక మహోత్సవాల ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, దేవస్థానం ఈవో రవికృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ శివకుమార్ కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్‌పై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నాయని, దుకాణాల అక్రమ బదిలీలతో పాటు భారీగా ఆర్థిక అవినీతి అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు అందాయని తెలిపారు. దేవుని పేరుతో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా, పలు దేవాలయాల ఆదాయ–వ్యయ లెక్కలు కూడా సక్రమంగా లేవని ఆరోపణలు వస్తున్నాయని, అవసరమైతే వాటిపై విజిలెన్స్ విచారణకు కూడా సిఫారసు చేస్తామని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు.



# చెరువుల అభివృద్ధికి అమృత్ 2.0 కింద రూ.4.50 కోట్ల నిధులు మంజూరు

## - ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్



**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు నియోజకవర్గంలోని పలు చెరువుల అభివృద్ధికి అమృత్ 2.0 పథకం కింద రూ.4.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే, రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ తెలిపారు. శనివారం గూడూరు పట్టణ చెరువు పునరుద్ధరణ పనులకు రూ.1.40 కోట్ల వ్యయంతో ప్రజా ఆరోగ్యం, మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులకు ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నాయకులు, అధికారులతో కలిసి చెరువు కట్టను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గూడూరు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.13 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గూడూరు మున్సిపాలిటీకి ఎన్నికలు జరగకపోవడానికి గత వైసీపీ ప్రభుత్వ తప్పిదాలే కారణమని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ పరిశీలకురాలు లక్ష్మీప్రసన్న, టీడీపీ రాష్ట్ర నాయకులు శీలం కిరణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాక్ ఏజెన్సీ డైరెక్టర్ గుండాల లీలావతి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిబిల్లు చెంచురామయ్య, జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ రహీం, పట్టణ, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, డివిఎంసి సభ్యులు రావూరు సురేంద్ర, పప్పు, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునరావు, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

## - సూళ్ళూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



**దొరవారిసత్రం, (రాజధాని వార్తలు):** దొరవారిసత్రం మండలం వెదురుపట్టు పంచాయతీ పరిధిలోని తుంగమడుగు హరిజనవాడలో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సుళ్ళూరుపేట శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె స్వయంగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అనంతరం 'ఇంటింటికీ సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా ప్రతి గడపకూ వెళ్లి, గత రెండు సంవత్సరాలుగా కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ, గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో ఎలాంటి సంక్షేమం, అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను నేరుగా అందిస్తోందని స్పష్టం చేశారు. తుంగమడుగు పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఈ సందర్భంగా ఆమె గ్రామ ప్రజలకు మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సుళ్ళూరుపేట నియోజకవర్గ ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, మండల అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులు నాయుడు, వెదురు పట్టు పంచాయతీ నాయకులు పల్లంపర్తి మనోహర్ రెడ్డి, మునీంద్రయ్య పాల్గొన్నారు. వీరితో పాటు మండలంలోని టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ సభ విజయవంతం చేసినందుకు అభినందనలు

## - పీఎం, సీఎంతో వేదిక పంచుకున్నందుకు ఆనందం - ఇన్‌చార్జ్ మంత్రులు, అధికారులు, ప్రజలు, మీడియాకు కృతజ్ఞతలు : రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్




**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఎంతో కాలంగా ఉద్విగ్నంగా ఎదురు చూసిన శ్రీ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ హరిత విమానాశ్రయం ప్రారంభ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి మోదీ గారి సభను విజయవంతం చేసినందుకు ఉత్తరాంధ్ర ప్రజానికానికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం అశేష ప్రజానీకం హర్షధ్వానాల మధ్య ఉత్తరాంధ్రను ఉత్తమాంధ్రగా మార్చే అల్లూరి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి మోడీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్ర పౌరవిమానయాన శాఖా మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు, యువనాయకులు నారా లోకేష్‌ల ఆధ్వర్యంలో ప్రారంభించడం..ఈ ప్రాంత భవిష్యత్తు అభివృద్ధికి పునాదులు వేసినట్లైందని మంత్రి తెలిపారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా సుందరంగా విమానాశ్రయం నిర్మించిన ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ, జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లిఖార్జునరావుకి, అలాగే విమానాశ్రయానికి శ్రీకారం చుట్టిన అశోక్ గజపతిరాజుకి, ఈ ప్రాంత అభివృద్ధి కోసం భూములు త్యాగం చేసిన రైతన్నలకు ఈ ప్రాంత ప్రజలు ఎల్లప్పుడు రుణపడి ఉంటారన్నారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని... అలాగే ప్రధాన మంత్రికి స్వాగతం పలకడానికి విచ్చేసిన గిన్నీస్ బుక్ రికార్డుల్లోకి ఎక్కిన ఉత్తరాంధ్ర ఐకాన్ కళ అయిన గిరిజన థింసా నృత్య కళాకారులకు, గురువులకు, ప్రజలను ఉత్తేజపరచడానికి తప్పెట గుళ్ళు, కూచిపూడి భరతనాట్యం, జానపద గేయాలు, గరగ నృత్యం చేసిన కళాకారులకు కూడా మంత్రి అభినందనలు తెలిపారు. గత పది రోజులుగా విమానాశ్రయ ప్రారంభోత్సవం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఏర్పాట్లు పర్యవేక్షించిన ఇన్‌చార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, కూటమి పార్టీల నాయకులందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో చాకచక్యంగా విధులు నిర్వహించిన అధికారులు అందరికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. బహిరంగ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజానీకానికి చేయూతగా నిలిచి, సమస్త ఏర్పాట్లు దగ్గరుండి నిర్వహించి, ముఖ్యంగా పకడ్బందీగా భోజన ఏర్పాట్లు చేసిన కూటమి నాయకులకు, అలాగే ఉత్తరాంధ్ర ఖ్యాతిని దశదిశలా చాటిచెప్పిన స్థానిక, జాతీయ, అంతర్జాతీయ మీడియా, పత్రికా మిత్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

**ప్రధానితో వేదిక పంచుకోవడం ఆనందంగా ఉంది..**

ఉత్తరాంధ్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన విమానాశ్రయ ప్రారంభవేదికలో మహామహులైన ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి వేదిక పంచుకోవడం చాలా ఆనందాన్ని కలిగించిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. తనకు అంతటి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఉత్తరాంధ్ర ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానంలో వైభవంగా సహస్ర ఘటాభిషేకం



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానంలో శనివారం సహస్ర ఘటాభిషేకం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, సహస్ర ఘటాలలో పవిత్ర జలాలను సిద్ధం చేసి స్వామి వారికి ఘటాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సహస్ర ఘటాభిషేకం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారికి విశేష అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ బి.కె. వెంకటేశులు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కే.సాయి ప్రసాద్, పాలక మండలి సభ్యులు గుర్రప్ప శెట్టి, లక్ష్మమ్మ తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు మాట్లాడుతూ లోకకల్యాణం, ప్రజల సుఖశాంతులు, సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ సహస్ర ఘటాభిషేకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# పారదర్శక నియామకాలు నచ్చని వైసిపి

## - డా.జి.దశరథాచారి, డా.యం.ఉమేష్ రావు



**శ్రీకాళహస్తి టౌన్, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నిరుద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ మెగా డియస్సీని నిర్వహించి, రాష్ట్ర చరిత్రలోనే అతి తక్కువ సమయంలోనే రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఉపాధ్యాయ పోస్టులను పారదర్శకంగా నియామకాలు చేపట్టడం వైసిపి నాయకత్వానికి నచ్చక రాద్ధాంతం చేస్తున్నదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథాచారి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావులు ఆరోపించారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు కనీసం ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా, నిరుద్యోగ ఉపాధ్యాయులను క్షోభ పెట్టిన జగన్ రెడ్డి, కష్టపడి చదివి నేడు టీచర్ ఉద్యోగాలు సాధించుకున్న నిరుద్యోగ యువతను అవమానించే రీతిలో ఫేక్ ఆరోపణలతో పైశాచిక ఆనందాన్ని పొందుతున్నాడని ఆరోపించారు. మెగా డియస్సీ నియామక ప్రక్రియలో 16,347 పోస్టులను భర్తీ చేసే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం పైన పసలేని ఆరోపణలు చేస్తూ, వీధి నాటకాలు వేస్తున్నారని ఆరోపించారు. దేశంలోని అనేక ప్రభుత్వ సంస్థలు తమ పోటీ పరీక్షలను టీసీఎస్ ఐఆన్ సంస్థ ద్వారానే నిర్వహిస్తు న్నాయి. ఎస్సెఎస్సి, ఆర్ ఆర్ బి, జ్యుడీషియల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలకు చెందిన 100కు పైగా పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన టీసీఎస్ ఐఆన్‌కే డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహణ బాధ్యత లను అప్పగించడం జరిగిందని తెలిపారు. సీబీటీ విధానంలో డీఎస్సీ నిర్వహించడం వలన ఎక్కడా మ్యాన్యువల్‌గా జోక్యం చేసుకునే అవకాశం ఉండదని, ప్రక్రియ మొత్తం సాంకేతికత ఆధారంగా జరుగుతుందని, కాబట్టి ఎక్కడా ప్రొసీజర్ ఉల్లంఘనకు ఆస్కారమే లేదనే విషయాన్ని గొడ్డలి పార్టీ సైకో బృందాలు తెలుసుకోవాలని హితవు పలికారు.అవినీతి సాక్షి ఫేక్ ప్రచారం చేస్తూ డియస్సీ నియామకాలలో మహిళా కోటా, దివ్యాంగుల కోటా కింద ఉద్యోగాలు వస్తే, వాటిని కూడా పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తూ, ఏడాది తర్వాత ఇప్పుడు కొత్తగా అపోహలు సృష్టించి, అనుమానాలు రేకెత్తించి, ఉపాధ్యాయ వృత్తిలో చేరిన వారిని క్షోభ పెట్టడం ఏమాత్రం సమంజసం కాదని హెచ్చరించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, ప్రతీ కుటుంబానికి భరోసా ఇస్తూ, ప్రతీ ప్రాంతానికి అభివృద్ధిని అందిస్తూ రెండేళ్లలో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న ఎన్డీయే కూటమి ప్రభుత్వం యొక్క రెండేళ్ళ నమ్మకమైన పాలనాకాలంలో సాధించిన ప్రగతిని వివరించే కార్యక్రమంలో భాగంగా బూత్ కన్వీనర్ గాజుల భగత్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఈరోజు శ్రీకాళహస్తి పట్టణంలోని స్థానిక ఇందిరా నగర్ ప్రాంతంలోని ప్రజల వద్దకు వెళ్ళి కరపత్రాలను అందించి వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ డా.జి.దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, శ్రీకాళహస్తి పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి గాదిపాకుల గోపీనాథ్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, బూత్ కన్వీనర్ గాజుల భగత్, తిరుపతి పార్లమెంటు నాయకులు సుబ్రహ్మణ్యం, పూల శేఖర్, విజయ, మణి, ఈశ్వరయ్య, శంకరయ్య, రాకేష్, కిరీటి తదితరులు పాల్గొన్నారు.

# 36 సంవత్సరాల పాటు అంకితభావంతో సేవలందించిన స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మికి ఘన వీడ్కోలు










**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ యస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి పదవీ విరమణ సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణ మాట్లాడుతూ సుబ్బలక్ష్మి 36 సంవత్సరాల పాటు వివిధ శాఖల్లో నిజాయితీ, నిబద్ధత, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రభుత్వ సేవకు విశేష కృషి చేశారని కొనియాడారు. సహోద్యోగులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో చూపిన అంకితభావం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, సేవాభావానికి కాదని పేర్కొంటూ, ఆమె ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ సందర్భంగా ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి మాట్లాడుతూ తన 36 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో సహకరించిన జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు, సహోద్యోగులు, సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

అందరి సహకారంతోనే తన విధులను విజయవంతంగా నిర్వహించగలిగానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొని సుబ్బలక్ష్మికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# పులుల సంరక్షణ, నిర్వహణ చర్యలపై అధ్యయనానికి హైపవర్డ్ కమిటీ

**- ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఐదుగురు సభ్యులతో నియామకం - నల్లమలలో అనుమానాస్పద స్థితిలో పులి మరణంపై పవన్ కళ్యాణ్ సీరియస్ - పులులు, వన్యప్రాణుల సంరక్షణ చర్యలపై సమగ్ర నివేదికకు ఆదేశం**




**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** పులులే అడవులకు ప్రాణం... అడవులే ప్రకృతి సమతుల్యతకు ఆధారం, పులుల సంరక్షణలో ఎలాంటి రాజీ ఉండదన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ పర్యా వరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు దేశంలోనే అతిపెద్ద పులుల ఆవాసాలలో ఒకటైన నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్‌లో పులుల సంరక్షణ వ్యవస్థను సమగ్రంగా సమీ క్షించి, భవిష్యత్తు కార్యాచరణకు మార్గదర్శకాలను రూపొందించేందుకు హైపవర్డ్ కమిటీని ఏర్పాటు చేసింది. దేశంలోనే అతి పెద్ద పులుల ఆవాసాలలో ఒకటిగా గుర్తింపు పొందిన నాగార్జున సాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో రెండు రోజుల క్రితం ఆడ పులి అనుమానాస్పద మృతి ఘటనను పవన్ కళ్యాణ్ తీవ్రంగా పరిగణించారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలన, పులులు, వాటి ఆవాసాల సమర్థవంతమైన సంరక్షణకు తీసుకో వాల్సిన చర్యల ఆవశ్యకతను గుర్తించారు. పులులతోపాటు వన్య ప్రాణుల సంరక్షణ చర్యలు, హనుమాన్ కార్యకలాపాలు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర అధ్యయనం చేపట్టేందుకు వీలుగా ఈ హైపవర్డ్ కమిటీకి సిఫారసు చేశారు. రాష్ట్ర అటవీశాఖ సలహాదారు పి.మల్లికార్జునరావు, అడిషనల్ పీసీసీఎఫ్ రాహుల్ పాండే కమిటీలో శాఖాపరమైన సభ్యులుగా వ్యవహరించనున్నారు. అలాగే వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ సభ్యుడు బి.రాజశేఖర్, హైదరాబాద్ కన్జర్వేషన్ ఫర్ టైగర్ సొసైటీ ప్రతినిధి ఇమ్రాన్ సిద్ధిఖీ, ప్రముఖ వన్యప్రాణి శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నవీన్ కుమార్ కమిటీలో సభ్యులుగా సేవలందించనున్నారు. హైపవర్డ్ కమిటీకి క్షేత్రస్థాయిలో సహకారం అందించడంతోపాటు సమన్వయ బాధ్యతలను విధుల్లో ఉన్న సీసీఎఫ్ అధికారి నిర్వహించనున్నారు. పులుల జనాభా, ఆవాసాలకు ఎదురవుతున్న ముప్పులను గుర్తిస్తూ సమగ్ర అంచనా నివేదిక రూపొందించడం, నివారణకు తగిన వ్యూహాలకు రూపకల్పన చేయాలని హైపవర్డ్ కమిటీ సభ్యులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ దిశగా నిర్దేశం చేశారు. ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలు, సంస్థాగత సంస్కరణలు, సిబ్బంది సామర్థ్యాల పెంపు, మౌలిక సదుపాయాల బలోపేతం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం తదితర అంశాలపై సమగ్రమైన సిఫారసులు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి వర్యులు సూచించారు. క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికా రులు, ఇతర భాగస్వామ్య వర్గాలతో సమావేశాలు నిర్వహించి, శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను పరిశీలించి వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. పులుల సంరక్షణ, అడవుల పరిరక్షణ, జీవవైవిధ్య రక్షణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. హైపవర్డ్ కమిటీ సిఫారసులు నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్‌లో తీసుకుంటున్న సంరక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

# తెలుగు నాటకరంగ పితామహుడు 'బళ్లారి రాఘవ' జయంతి వేడుకలు

**- అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో నాట్యకళా ప్రపూర్ణునికి ఘన నివాళి**







**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** తెలుగు నాటక రంగానికి చిరస్మరణీయ సేవలు అందించిన మహానటుడు, 'నాట్యకళా ప్రపూర్ణ' బళ్లారి రాఘవాచార్యులు జయంతి వేడుకలను అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎస్.బి డీఎస్పీ జి.ఆర్.ఆర్. మోహన్, ఎన్‌డి పిఎస్ సెల్ సీఐ పిల్లా రమేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొని, బళ్లారి రాఘవాచార్యులు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రంగస్థల కళకు పునాది వేసిన మహనీయుడు, బళ్లారి రాఘవ సేవలను స్మరించుకున్నారు. జననం & నేపథ్యం: 1880 ఆగస్టు 2న ప్రస్తుత కర్ణాటకలోని బళ్లారిలో నరసింహాచార్యులు, శేషమ్మ దంపతులకు జన్మించిన తాడిపత్రి రాఘవాచార్యులు, వృత్తిరీత్యా న్యాయవాది అయినప్పటికీ రంగస్థల కళపై ఉన్న మక్కువతో జీవితాన్ని నాటకరంగానికే అంకితం చేశారు. సహజ నటనకు ఆద్యుడు...పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలలో పాత్రల్లో లీనమై నటించి "బళ్లారి రాఘవ"గా దేశవ్యాప్తంగా విశేష ఖ్యాతి గడించారు. సామాజిక సంస్కర్త... నాటకం కేవలం వినోదమే కాకుండా సామాజిక చైతన్యానికి సాధనమని నమ్మిన ఆయన, ఆ రోజుల్లోనే నాటకాల్లో మహిళా పాత్రలను మహిళలే పోషిం చాలనే విప్లవాత్మక అభ్యుదయ భావనను ప్రోత్సహించారు. అమర దీపం... 1946 ఏప్రిల్ 16న మద్రాసులో కన్నుమూసినప్పటికీ, ఆయన అందించిన నటన సంప్రదాయం, ఆదర్శాలు నేటికీ కళాకారులకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. ఆయన చూపిన బాటలో నడుస్తూ, తెలుగు నాటక కళను పరిరక్షించి భావితరాలకు అందించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అధికారులు పేర్కొన్నారు.

# జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం

**- చీమకుర్తిలో జాతీయ నోటి పరిశుభ్రత దినోత్సవం**







**చీమకుర్తి, (రాజధాని వార్తలు):** జాతీయ నోటి పరిశుభ్రత దినోత్సవంను పురస్కరించుకొని చీమకుర్తి లయన్స్ క్లబ్ - గెలాక్సీ వారి ఆధ్వర్యంలో డాక్టర్ జవహర్ అధ్యక్షతన విజయ్ డెంటల్ హాస్పిటల్ వారి సమక్షంలో డాక్టర్ వేల్పుల విజయ్ కుమార్ మరియు డాక్టర్ అనురాధ ఉచితంగా 200 మంది బాలికలకు దంత పరీక్షలు నిర్వహించడము జరిగింది. వారికి అవసరం అయిన టూత్ పేస్ట్, బ్రష్ మరియు మౌత్ వాష్ ఉచితంగా అందించారు. డాక్టర్ జవహర్ మాట్లాడుతూ దంత సంరక్షణ చాలా ముఖ్యం అని, శరీరంలోని అన్ని రోగాలకు కారణం దంత సమస్యల వల్లే అని అందువలన నోటి పరిశుభ్రత ముఖ్యం అని తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ నోటి పరిశుభ్రత గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. ప్రతిరోజూ రెండు పూటలా బ్రష్ చేసుకోవాలని, తిన్న తర్వాత నోటితో పుక్కిలించాలని తెలియజేశారు. పంటి సమస్యలు వచ్చిన తర్వాత కన్నా ముందుగానే తగు జాగ్రత్తలు తీసుకొంటే దంత సమస్యలు నివారించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ నరసింహారావు, లయన్ చలువాది రమేష్ ఎస్‌కెఆర్ బదిరుల పాఠశాల కరెస్పాండంట్ అంజిరెడ్డి లయన్ చాలా శ్రీనివాస్, ఉపాధ్యాయులు సుబ్బారావు, రాధ మాధవి మరియు ఇతర అధ్యాపక బృందం వారు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# త్రైత సిద్ధాంత భగవద్గీత & కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై అవగాహన



**విడవలూరు, (రాజధాని వార్తలు):** త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామివారి దివ్య ఆశీస్సులతో సెప్టెంబర్ 4వ తేదీన రానున్న శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగను పురస్కరించుకొని ఆదివారం "త్రైతసిద్ధాంత ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ" సభ్యుల ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా, విడవలూరు మండలంలోని చౌక చర్ల, తుమ్మగుంట, తుమ్మగుంట కాలనీ, వావిళ్ళ గ్రామాల్లో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథముల ఇందూ ధర్మ ప్రచారముపై అవగాహన ఇంటింటా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

**శ్రీకృష్ణ భగవానుడికి మాత్రమే ఊరేగింపు చేయాలి :**

దేవుడే అవతరించి ఒక మనిషిగా జన్మిస్తే ఆయనను భగవంతుడు అని అంటాము... అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడు, ఆయనను మాత్రమే అందరూ దైవంగా గుర్తించాలి అని ఊరిలోని వారందరికీ ఎరుక పరచుటకు ఈ ఊరు ఎరిగింపు (ఊరేగింపు) కార్యక్రమం చేయడం జరుగుతుంది అని, పూర్వం శ్రీ కృష్ణాష్టమి 11 రోజుల పాటు చేసేవారు చివరిగా చవితి రోజున ఊరేగింపు చేసి ముగించేవారు. అని ప్రబోధ సేవా సమితి సభ్యులు తెలిపారు. (శ్రీ కృష్ణ పరమాత్మ ఊరేగింపు చేసిన గ్రామంలో ప్రకృతి వైపరీత్యాలు, రోగ బాధలు ప్రజలకు ఉండవు అని పూర్వం పెద్దలనెడివారు) కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక- నెల్లూరు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు డి.సురమౌళిలి సునీల్, సుదర్శనమ్మ, కల్పన, రామయ్య, రమ, కావ్య శ్రీ, సుమలత, పద్మజ, గుప్త రాజు, శేఖర్, షకీలా, ధనలక్ష్మి, ప్రవీణ, వెంకటేశ్వరరావు, అన్నపూర్ణ, శేషారత్నమ్మ, సిద్ధార్థ, సుందర రాజా, డివి ప్రసాద్, రఘురామయ్య, నరసింహ ప్రసాద్‌లు పాల్గొన్నారు.

# మన తిరుపతి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



**తిరుపతి, (రాజధాని వార్తలు):** మన తిరుపతి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో తిరుపతి తీర్థకట్ట వీధిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని మన తిరుపతి ప్రెస్ క్లబ్ పాత్రికేయుల సహకారంతో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ప్రేమతో అన్నప్రసాదాన్ని పంపిణీ చేసి ఆధ్యాత్మిక సేవలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా మన తిరుపతి ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు తపసి మురళి రెడ్డి మాట్లాడుతూ, తొలి ఏకాదశి వంటి పవిత్రమైన రోజు నుండి ప్రతి శనివారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో శుభసూచకమని, భక్తులకు సేవ చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. సమాజ సేవే లక్ష్యంగా మన తిరుపతి ప్రెస్ క్లబ్ వివిధ సేవా కార్యక్రమాలను చేపడుతోందని, సామాజిక సేవలో పాత్రికేయులు కూడా ముందుండాలని, ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మరింత చేరువ కావాలన్నదే ప్రెస్‌క్లబ్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మన తిరుపతి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు గొడ్డిండ్ల, ఆధ్వర్యంలో ఉపాధ్యక్షులు పొన్నా రవికుమార్, అనిల్ రాయల్, ప్రెస్ క్లబ్ అడ్వైజర్ శ్రీకాంత్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వారి తల్లి గొడ్డిండ్ల రెడ్డమ్మ, తపసి వరలక్ష్మి రెడ్డి, టి ప్రియాంక రెడ్డి, వైష్ణవి రెడ్డి, మోహనాచారి, కుంచపు శంకర్ మరియు ఆలయ ధర్మకర్త వినోద్ రాయల్, పాటు ప్రెస్ క్లబ్ సభ్యులు,అ పాత్రికేయులు, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమం భక్తిపూర్వక వాతావరణంలో జరిగింది.

